



నాడు మొక్కుబడి
నెరవేరని జలసిరి

రైతుల కల మన వైఎస్ఆర్ జలకళ అనే నినాదంతో ప్రవేశ పెట్టిన జలకళ పథకం కలగానే మిగిలింది. వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ బోర్ల నిర్మాణాన్ని అటకెక్కిం చింది. మొక్కుబడిగా ఈ పథకాన్ని అమలు చేసి ఆ ప్రభుత్వం చేతు లు దులుపుకుంది. రైతుల ప్రయోజనా లకు పెద్ద పీట వేశామని గొప్పలు చెపుకున్న ప్రభుత్వం బోర్ల నిర్మాణాన్ని చేపట్టలేదు. పల్నా డు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో 15,341 మంది రైతు లు దరఖాస్తులను ఆమోదించినప్పటికీ గత ఐదేళ్లలో 2,208 బోర్లు మాత్రమే నిర్మించారు. విద్యుత్ కనెక్షన్‌లు లేక వందలాది బోర్లు నిరుపయోంగా ఉన్నాయి. నాడు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఎన్‌టీఆర్ జలసిరి పథకాన్ని ప్రవేశపెట్టి రైతులకు వ్యవసాయ బోర్లు నిర్మించారు. సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలసిరిని మళ్లీ అమలు చేస్తారని, బోర్ల నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

- తూతూమంత్రంగా బోరుల నిర్మాణం
- వైసీపీ ప్రభుత్వంలో అంతులేని నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వం నిర్ణయం కోసం రైతుల చూపు

బోర్ల నిర్మాణం క్లస్టర్‌ల వారీగా ఇలా ..

క్లస్టర్	దరఖాస్తులు	ఆమోదించినవి	నిర్మించినవి
నరసరావుపేట	823	715	104
సత్తెనపల్లి	1,894	1,532	134
మాచర్ల	5,061	4,170	741
వినుకొండ	2,563	1,954	200
గుంటూరు	197	157	11
తెనాలి	279	229	122
బాపట్ల	314	236	75
చీరాల	4210	3492	821
మొత్తం	15,341	12,485	2,208

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చిన్న సన్న కారు రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయం బోరు బావులను ఉచితంగా నిర్మించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం అర్భాటంగా ప్రవేశపెట్టి అమలులోకి తీసుకొచ్చింది. చిన్న, సన్న కారు రైతుల వ్యవసాయ భూమిని సేద్యానికి అనుకూలంగా మార్చేందుకు, భూగర్భ జలాలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకొనేందుకు ప్రవేశపెట్టిన బోర్ల నిర్మాణం పథకం వారికి అక్కరకు రాలేదు. బోర్ల నిర్మాణం కోసం ఆశగా ఎదురు చూసిన అన్నదాతలకు అడియాసే మిగిలింది. ఈ పథకానికి ప్రధానంగా నిధుల కొరత వెంటాడింది. నిర్మించిన బోర్లకు పూర్తి స్థాయిలో బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో బోర్ల నిర్మాణాలు నిలిచి పోయాయి. నిర్మాణం పూర్తయిన బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వలేకపోయారు. దీంతో వందలాది బోర్లు నిరూపయోగంగా మారాయి. నెలల తరబడి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వక పోవడంతో అవి పూడి పోయే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన బోరు

◆ పల్నాడు జిల్లాల్లో 10,341 మంది రెతులు బోర్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 8,371 దరఖాస్తులను ఆమోదించినప్పటికీ 1,179 బోర్లు మాత్రమే నిర్మించారు. నిధుల కొరతతో బోర్లు నిర్మాణం నిలిచిపోయింది. బోర్లకు మోటార్లు అమర్చడంలో, విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరిగింది. విద్యుత్ కనె క్షన్‌లు లేక వందలాది బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లలో బోర్లు అందుబాటులోకి రాకపోవడంతో వేలాది మంది రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

◆ బాపట్ల జిల్లాలో 4524 మంది రైతులు దరఖాస్తు చేసు కున్నారు. వీటిలో 3,728 దరఖాస్తులను ఆమోదించారు. 2279 భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన దరఖాస్తులలో 2105 బోర్లు నిర్మాణానికి అనుమతిచ్చారు. వీటిలో 1779 బోర్లకు పరి పాలన అనుమతి ఇచ్చారు. 896 బోర్లను మాత్రమే నిర్మిం చారు. నిర్మించిన బోర్లలో 63 బోర్లు విఫలమైనట్టు గుర్తిం చారు. 42 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు.

◆ గుంటూరు జిల్లాలో 476 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 386 దరఖాస్తులను ఆమోదించారు. 181 భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన దరఖాస్తులలో 197 బోర్లు నిర్మాణానికి అనుమతిచ్చారు. వీటిలో 170 బోర్లకు పరిపాలన అనుమతి ఇచ్చారు. 133 బోర్లను మాత్రమే నిర్మించగా వీటిలో 34 బోర్లు పనిచేయడం లేదని నిర్ధారించారు. 44 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు.

ఎన్‌టీఆర్ జలసిరిని పునరుద్ధరించేనా ?



తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన వ్యవసాయ బోర్లు.. సోలార్ పంపు సెట్లు



నాడు తెలుగుదేశం ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకం పేరుతో వ్యవసాయ బోర్ల నిర్మాణాన్ని పథకాన్ని అమలు చేసింది. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్న కారు రైతుల కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టి విజయవంతంగా నిర్వహించారు. బోరు నిర్మించడంతో పాటు దీనికి సోలార్ పంపు సెట్ కూడా ఏర్పాటు చేశారు. జలసిరి పథకాన్ని జలకళగా మార్చిన వైసీపీ ప్రభుత్వం బోర్ల నిర్మాణం నామమాత్రంగా కూడా చేయలేదు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో బోర్ల నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగురించాయి. జలసిరి పథకం మళ్లీ అమలు చేస్తారని ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో సాగు నీటి కరువు నెలకొంటోంది. దీంతో సాగుకు వ్యవసాయ బోర్లు ఆధారమవుతు న్నాయి. ప్రభుత్వం జలసిరి అమలుపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం నిర్ణయం కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

- ఉమ్మడి జిల్లాలోరూ. 600 కోట్లుకు పైగా వ్యయం
- తల్లిదండ్రుల కమిటీ పేరుతో వైసీపీ నేతలకు కాంట్రాక్టులు
- నేటికి నిర్మాణ దశలోనే భవనాలు... వాటర్‌ప్లాంట్స్ నిర్వహణ గాలికి



నాడు-నేడు అక్రమాలపై విచారణ

గుంటూరు(విద్య)జులై 29: ఉమ్మడి జిల్లాలో మనబడి నాడు-నేడుపేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన అక్రమాలపై విచారణకు రంగం సిద్ధం అయింది. ఇటీవల అసెంబ్లీలో సైతం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు నాడు నేడు అక్రమాలపై విచారణ చేయాలని విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అక్రమాలపై విచారణకు కార్యచరణ సిద్ధం అయింది. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి అక్రమాలను నిగ్గుతేల్చనున్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులపై వేటు వేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో మన బడి, నాడు నేడు తొలి దశలో 1149 పాఠశాలలను ఎంపిక చేసి దాదాపు రూ. 325 కోట్లుకుపైగా ఖర్చుచే సిన ట్లు స వ నా

చారం. రెండోదశలో 1344 పాఠశాలలను ఎంపిక చేసి మరో 340 కోట్లు వెచ్చించి ఆధునీకరణ పనులు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుల ప్రమాణాలు పెంచటం, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా గత ప్రభుత్వంలో మొదలైన పనులు ఇంకా పూర్తికాలేదు. శిథిలమైన ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నామనే ముసుగుతో అస్మదీయులకు తల్లిదండ్రుల కమిటీ మాటున కాంట్రాక్టులు కట్టబెట్టి భారీ స్థాయిలో వైసీపీ నాయకులు దోచుకున్నారనే ఆరోపణలు మొదటి నుంచి వస్తున్నాయి. తాగునీరు, టాయిలెట్, ఫర్నిచర్, కాంపౌండ్‌వాల్, పెయింటింగు, మరమ్మతులు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు, వంటగది నిర్మాణం, ఇంగ్లీషు మీడియం ల్యాబ్‌లు ఏర్పాటు పేరుతో పెద్ద మొత్తంలో కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సైతం కార్పొరేట్ కట్టడాలకు దీటుగా తీర్చిదిద్ది విద్యా వికాసానికి బాటలు వేస్తున్నామని నాటి ప్రభుత్వం చేసిన వాగ్దానాలు నీటిమీద రాతలేనని స్పష్టం అయింది. దానికి ప్రత్యక్ష నిదర్శనం నేటికి పూర్తికాని భవనాలే.

నిర్మాణ దశలోనే పనులు..

ఉమ్మడి జిల్లాలో నాడు నేడు పనులు 2021లో ప్రారంభించారు. అంటే దాదాపు అయిదేళ్ళు పూర్తి కావస్తున్నా పనులు ఇంకా పూర్తికాలేదు. ప్రతి నియోజక వర్గంలో వైసీపీ నేతలే ఈ పనులు చేశారు. అనేక చోట్ల పనుల్లో నాణ్యత లోపం కనిస్తున్నా బిల్లులు చెల్లింపు మాత్రం యధేచ్ఛగా సాగించారు. జిల్లాలో మొదటి విడత ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ ప్లాంటులు ఇప్పుడు దాదాపు మూతపడ్డాయి. కాంట్రాక్టు ఏజెన్సీ ఐదేళ్ల పాటు మరమ్మతులు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రెండో దశలో కూడా సంవత్సరం క్రితం అనేక స్కూల్స్‌కు వాటర్ ప్లాంట్లు వచ్చాయి. వీటిని ఇంత వరకు వినియోగం లోకి తీసుకురాలేదు.

తూతూ మంత్రంగా పర్యవేక్షణ

నాడు నేడు పనుల పర్యవేక్షణను ఇటు విద్యాశాఖ, అటు సమగ్రశిక్ష అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. పనుల పురోగతిని యాప్స్‌లో నమోదు చేయమని ఉపాధ్యాయలకు ఆదేశాలు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో నాణ్యత, పనుల వేగం గురించి ప్రశ్నించిన దాఖలాలు లేవు. దీంతో నాడు నేడు పనులు జిల్లాలో ఇష్టారాజ్యంగా సాగాయి. కొంతమంది అధికారులు ఇందుకు ఇతోధికంగా సహకారం అందించి బిల్లుల మంజూరులో భారీ స్థాయిలో కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇందులో మిలాఖత్ అయ్యారని ఫిర్యాదులు ఉన్నాయి.

పాసు పుస్తకాలపై రాజముద్ర

రెవెన్యూ శాఖను ఆదేశించిన సీఎం చంద్రబాబు నాయుడు ● కొత్త పుస్తకాలకు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆస్తి వివరాలు, అడ్రస్ ● తన బొమ్మ కోసం రూ.15 కోట్లు వృధా చేసిన జగన్

గుంటూరు సిటీ ,జూలై 29 : భూ యజమానులకు శుభవార్త. త్వరలో కొత్త పాసు పుస్తకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇవ్వబోయే పాసు పుస్తకాలపై రాజముద్రను ముద్రించనున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబునాయుడు అధికారులకు పలు సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కీలకమైన విషయాలపై దృష్టి సారించిన సీఎం పాసు పుస్తకాలపై జగన్ బొమ్మను ముద్రించి పంపిణీ చేయటం వల్ల భూ యజమానుల్లో నెలకొన్న ఆందోళనపై చర్యలు చేపట్టారు. పాసు పుస్తకాలపై వ్యక్తుల ఫోటోలు ఉండటం వల్ల ప్రజల్లో అనేక రకాల భయభ్రాంతులు నెలకొన్న సంగతి ఎన్నికల సందర్భంగా బహిర్గతం అయ్యింది. చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో కూడా చాలా మంది రైతులు, భూ యజమానులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తమ ఆస్తుల పత్రాలపై జగన్ బొమ్మలు ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక పాసు పుస్తకాలు మారుస్తామని చంద్రబాబు నాయుడు హామీ కూడా ఇచ్చారు.ఈ నేపథ్యంలో ప్రచార పిచ్చితో జగన్ ప్రభుత్వం అడ్డగోలుగా రెవెన్యూ శాఖలో తీసుకున్న నిర్ణయాలపై సీఎం సమీక్ష నిర్వహించి కొత్త పుస్తకాలు రాజముద్రతో ఉండాలని అధికారులను ఆదేశించారు.

లోన్లు ఇవ్వని బ్యాంకర్లు

ప్రస్తుతం భూ యజమానుల వద్ద వున్న పాసు పుస్తకాలపై జగన్ మోహన్ రెడ్డి బొమ్మను ముద్రించారు. కేవలం ముందు పేజీలో మాత్రమే కాకుం డా, లోపల ఉన్న ప్రతి పేజీలోను ఆయన బొమ్మలు ఉన్నాయి. ఈ పుస్తకాలు తీసుకొని బ్యాంకర్ల వద్దకు వెళ్తే రుణాలు ఇవ్వమని మొఖం మీదే చెప్పేసి రైతులను బ్యాంకుల నుండి బయటకు పంపారు. ఇది అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులకు బాగా ఇబ్బంది కరంగా అనిపించింది. జగన్ బొమ్మ పాసు పుస్తకాలపై వేయటం వల్ల కొందరు అసలు తమకు ఆ పుస్తకాలు వద్దని తిరిగి గ్రామ సచివాలయంలో నే వాటిని ఇచ్చేసి వెళ్లారు. తమ తాతలు,తండ్రులు కష్టపడి సంపాదించిన ఆస్తులపై జగన్ బొమ్మ వేస్తే పాసు పుస్తకాలు ఎందుకు తీసుకుంటామని చాలా మంది భూ యజమానులు అధికారులకు ఎదురు తిరిగారు.గత ఎన్నికల్లో జగన్ ఓటమికి ఇదొక కారణంగా కనపడుతుంది.



గతంలో ఎన్నడూ లేదు..

పాసు పుస్తకాలపై 2019 కి ముందు ఉన్న ప్రభుత్వాలు సీఎంల ఫోటోలను ముద్రించిన దాఖలాలు లేవు. ఏ ప్రభుత్వం ఉన్న రాజముద్రతోనే పాసు పుస్తకాలు పంపిణీ చేసేవారు. జగన్ అధికారంలోకి వచ్చాక భూ యజమానులు అత్యంత భద్రంగా చూసుకునే పాసు పుస్తకాలపై సీఎం ఫోటోను ముద్రించారు. అందుకోసం రూ. 15 కోట్లు వరకు వృధా చేసినట్లు తెలుస్తోంది.

ఆధునికహంగులు

కొత్త పాసు పుస్తకాలు ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. నకిలీవి తయారు చేయటానికి వీలు లేకుండా కొత్త పుస్తకాలకు క్యూఆర్ కోడ్‌ను ఇస్తారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆస్థి వివరాలు, అడ్రస్ కూడా తెలుస్తుంది. క్యూఆర్ కోడ్‌స్కాన్ చేసి ఆస్థి ఉన్న అడ్రస్ వద్దకు తీసుకువెళ్లే మ్యాప్ కూడా వచ్చేలా ఏర్పాటు చేశారని తెలుస్తోంది .ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న క్యూ ఆర్ కోడ్ విధానం వల్ల భూ యజమానుల ఆస్తులకు భద్రత వంటి ప్రయోజనం కలుగుతుంది.

ఇసుక అక్రమ తవ్వకాలు అరికట్టండి

పెంఛన్ పంపిణీ అయ్యేవరకు ఎవరికీ సెలవు లేదు ● అధికారులకు కలెక్టర్ జె.వెంకటమురళీ ఆదేశాలు

బాపట్ల, జూలై 29 : బాపట్ల జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అధికారులు పూర్తిస్థాయిలో అరికట్టాలని కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఇసుకను ఇష్టానుసారంగా తవ్వకొని వెళుతుంటే అధికారులు నిర్లిప్తంగా చూస్తూ ఉంటున్నారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలన్నారు. దళారీల అక్రమాలను పూర్తి స్థాయిలో నియంత్రించాలన్నారు. మండలస్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమిస్తామన్నారు. నియమించిన కమిటీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తదుపరి ఇచ్చేనివేదిక ఆధారంగా సదరు వ్యక్తులపై కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకానికి మార్గదర్శకాలు విడుదలైన నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ తీర్మానాల ఆధారంగా పనులు కేటాయించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా ఫించన్ పథకానికి ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సచివాలయం సిబ్బందితో లబ్ధిదారులను మ్యాపింగ్ చేసి బ్యాంక్‌లు నుంచి నగదు డ్రా చేసి ఇవ్వాలన్నారు. ఫించన్ నగదు పంపిణీ చేసే వరకు ఎంపీడీవోలకు, సదరు సిబ్బందికి సెలవులు మంజూరు చేయరాదన్నారు. జిల్లా స్థాయి అధికారులు సైతం కలెక్టర్ అనుమతి పొందాలన్నారు. మండల కేంద్రాన్ని విడిచి అధికారులు వెళ్ళరాదని సూచించారు. ఆగస్టు 15 వేడుకలలో శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బీ సుబ్బారావు, జిల్లా రెవెన్యూఅధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, ఆయాశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జే వెంకటమురళీ

సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు



శ్రీశైలం నుంచి సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు

- శ్రీశైలం నుంచి లక్షన్నర కూసెక్కుల నీరు విడుదల
- ఖరీఫ్‌లో పంటల సాగుకు అనుకూలం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో జలాశయాలను వరద పోటెత్తుతోంది. శ్రీశైలం జలాశయం నిండు కుండలా మారింది. శ్రీశైలం మూడు గేట్లు తెరచి నాగార్జున సాగర్ జలాశయానికి నీటిని సోమవారం విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి, గేట్లు తెరచి దాదాపు లక్షన్నర క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు సాగర్ నీటిపై అన్నదాతల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. శ్రీశైలం జలాశయంలోకి సాయంత్రం 6 గంటలకు 4,51,080 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలంలో 215.81 టీఎంసీలకుగాను నీటి నిల్వ 184.28 టీఎంసీలకు చేరింది. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 63,466 కూసెక్కులు, గేట్ల తెరచి 81,000 కూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డి పాడుకు 18,000 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలశయానికి ఇదే స్థాయిలో వరద మూడు రోజులు కొనసాగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఇక్కడ నుంచి సాగర్‌కు నీటి విడుదల మంగళవారం మూడు లక్షల కూసెక్కులకు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

అల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి దాదాపు నాలుగున్నర లక్షల కూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలంలో నీటి మట్టం గంటగంటకు పెరుగుతోంది. సాగర్‌లో కూడా నీటి నిల్వ ఆశాజనకంగా పెరుగుతోంది. సాగర్‌లో గత నాలుగు రోజుల్లో 16 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. సాగర్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా సాయంత్రం 137.60 టీఎంసీలకు చేరింది. సాగర్ నుంచి కుడి కాలువకు 5,944 కూస్కెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైం ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ

ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్‌ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్‌ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్‌ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,50,000

ఎంసీఏ

ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50% మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,25,000

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 14
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగరం ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017
- **వెబ్‌సైట్:** https://audoa.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/yArgvZGలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు.



అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీ

● **డిగ్రీ ప్రోగ్రామ్‌లు**

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండో తరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులూ దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూమీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు అర్హులు.

● **డిప్లొమా ప్రోగ్రామ్‌లు**

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

● **పీజీ ప్రోగ్రామ్‌లు**

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ (మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

● **సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు**

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదో తరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.


విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

● ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

నవ్య | చిత్రజ్యోతి

కంటి చికిత్స కోసం అమెరికాకు?



బాలీవుడ్ నటుడు షారూఖ్‌ఖాన్ అత్యవసర కంటి చికిత్స కోసం అమెరికా వెళ్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో వినిపిస్తోంది. ఆయన కంటి సమస్యతో సోమవారం ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా, అక్కడి వైద్యులు అమెరికా వెళ్లాలని సూచించినట్లు సమాచారం. దీంతో నేడు షారూఖ్ అమెరికా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వార్తలపై షారూఖ్ పీఆర్ బృందం ఇంతవరకూ స్పందించలేదు. 2014లో షారూఖ్ కంటికి శస్త్ర చికిత్స జరిగింది. ఆయన ప్రస్తుతం కింగ్ చిత్రంలో నటిస్తున్నారు.

మూర్ఖులను గెలవలేము



ఆరోగ్యానికి సంబంధించిన చిట్కాలను అభిమానులతో పంచుకున్న సమంత వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. తాజాగా నయనతారకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. తనకు ఆసక్తిగా అనిపించిన పలు విషయాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమె మందార పువ్వులతో చేసిన టీ అంటే తనకు ఎంతో ఇష్టమని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తెలిపారు. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం దొరుకుతుందని నయనతార పేర్కొన్నారు. ఫాలోవర్స్‌ను నయనతార తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆమె చెప్పినదాంట్లో నిజం లేదని కొంతమంది వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె తన పోస్ట్‌ను తొలగించారు. 'మూర్ఖులతో వాదనకు దిగొద్దు. మీరు గెలవలేరు. మిమ్మల్ని కూడా వారి స్థాయికి దిగజార్చి ఓడిస్తారు' అనే మార్క్ ట్వైన్ సూక్తిని షేర్ చేశారు. తనను విమర్శించిన వారిని ఉద్దేశించి ఆమె ఈ పోస్ట్ పెట్టారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?

తమిళ చిత్ర పరిశ్రమ సోమవారం సమావేశమై కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంది. వీటిల్లో ప్రధానమైంది, తెలుగు నిర్మాతలు సాహసించి తీసుకోలేనిది ఏమిటంటే .. ఇకపై హీరోలు, హీరోయిన్లకు ముందుగా అడ్వాన్సులు ఇవ్వకూడదన్నది. కొంతమంది నటీనటులు, టెక్నీషియన్లు నిర్మాతల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుని సినిమాలకు డేట్స్ ఇవ్వకుండా ఆ తర్వాత ఒప్పుకొన్న చిత్రాలకు వర్క్ చేస్తున్నారు. ఇకపై అలా కాకుండా మొదట ఎవరివద్ద అడ్వాన్స్‌లు తీసుకున్నారో వారి షూటింగ్ పూర్తి చేసిన తర్వాతే కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొనాలి. తమిళంలో ఈ నిర్ణయాన్ని అమలు చేయగలరేమో కానీ తెలుగులో సాధ్యమయ్యే పనేనా అనే చర్చ తెలుగు చిత్ర పరిశ్రమలో మొదలైంది. ఎందుకంటే ప్రముఖ సంస్థలు పెద్ద హీరోలకు అడ్వాన్సులు ఇవ్వడం, వారు తీసుకోవడం సహజంగా జరిగేదే. ఇలా అడ్వాన్స్ ఇచ్చిన వెంటనే ఆ సినిమా మొదలవుతోందా అంటే చాలా సందర్భాల్లో లేదనే చెప్పాల్సి ఉంటుంది. కథ కుదరకో, కాంబినేషన్ సెట్ అవకో సినిమాలు ప్రారంభం కావడానికి లేట్ కావచ్చు. ఆ లేట్ అనేది నెలలు కావచ్చు, సంవత్సరాలు కావచ్చు. ఏళ్ల తరబడి వెయిట్ చేసినా చివరకు జరగని సందర్భాలు ఉన్నాయి కూడా. ఈ లోపు అన్నీ సెట్ అయిన వేరే సినిమా మొదలుపెట్టేస్తుంటారు హీరోలు. హీరోలకు ఇచ్చిన అడ్వాన్సులకు వడ్డీలు కడుతూ లోలోపల బాధ పడుతుంటారు తప్ప బయటకు వ్యక్తం వ్యక్తం చేయలేని పరిస్థితి. ఎందుకంటే ఎప్పటికైనా హీరోగారు కరుణించి డేట్స్ ఇవ్వవచ్చనే ఓ ఆశ వారిని సంవత్సరాల తరబడి వెయిట్ చేసేలా చేస్తుంటుంది. అలాగే ఒక సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ఓ వారం రోజుల పాటు షూటింగ్ చేసో, లేక కొంత భాగం షూట్




చేసిన తర్వాత ఆ సినిమాను అలా పక్కన పెట్టేసి మరో కొత్త చిత్రం చేసే హీరోలు తెలుగు చిత్రపరిశ్రమలోనూ ఉన్నారు. ఇలాంటి విషయాలపై తెలుగు చిత్ర పరిశ్రమ కూడా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడిస్తుంటుంది కానీ అవి ఆచరణకు దూరంగానే ఉంటున్నాయి. ఇటువంటి నేపథ్యంలో తమిళ నిర్మాతలమండలి తీసుకున్న నిర్ణయాలు రేకెత్తిస్తున్నాయి. తెలుగులో కూడా ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని నిర్మాతల మనసులో ఉంది కానీ పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?

తమిళ నిర్మాతల మండలి నిర్ణయాలు ఇవే

అధ్యక్షుడు ఎన్.మురళి నేతృత్వంలో సభ్యులు సోమవారం వివిధ సంఘాలకు చెందిన నిర్వాహకులు, ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఇందులో పలు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. అవేమిటో ఇప్పుడు చూద్దాం.

- ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ మొదలు పెట్టకూడదు. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న సినిమాలన్నీ అక్టోబరు 31 లోపు పూర్తి చేయాలని ఆయా చిత్ర బృందాలకు సూచించింది.
- పెండింగ్‌లో ఉన్న చిత్రాలు, ఇచ్చిన అడ్వాన్స్‌లపై నివేదిక అడిగిన నిర్మాతల మండలి.
- నవంబరు ఒకటినుంచి ఎలాంటి సినిమాల చిత్రీకరణ చేపట్టకూడదు.
- ఇప్పటికే చిత్రీకరణ పూర్తయి విడుదలకు నోచుకోని చిత్రాల పరిస్థితి ఒక కొలిక్కి వచ్చేంత వరకు ఆగస్టు 16 నుంచి కొత్త సినిమాలేవీ చిత్రీకరణ మొదలుపెట్టకూడదు.
- నటీనటులు, సాంకేతిక నిపుణులు జీతభత్యాలు పెంచుకుంటూ పోతున్నారని, ఖర్చులకు ఒక విధానమంటూ లేకపోయిందని, ఈ అంశాలపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిర్మాతలమండలి అభిప్రాయపడింది. వీటిని క్రమబద్ధీకరించడంతో పాటు సరైన ప్రణాళికతో ముందుకుసాగాలని, అందువల్ల నవంబరు ఒకటో తేదీ నుంచి ఏ ఒక్క సినిమా షూటింగ్ జరగరాదని తీర్మానించింది.
- అగ్రనటులు నటించే కొత్త చిత్రాలను ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలకు ఇవ్వాలని తీర్మానించింది.

-ఆంధ్రజ్యోతి, చెన్నై



ధనుష్ పై ఆగ్రహం

హీరో ధనుష్‌పై తమిళ నిర్మాతల మండలి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈయన ఆరు చిత్ర నిర్మాణ సంస్థల నుంచి అడ్వాన్స్‌లు తీసుకున్నారని, ఇలా అడ్వాన్సులు చెల్లించిన మిగిలిన నిర్మాతలు కూడా అసోసియేషన్‌తో మాట్లాడి తమ పనులు మొదలు పెట్టాలని సూచన చేసింది. ఇకపై నిర్మాతల మండలి అనుమతి ఉంటేనే ధనుష్ చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తుంది. అయితే ధనుష్ ఇప్పుడు తెలుగులో రెండు చిత్రాల్లో నటిస్తున్నారు కనుక ఈ నిర్ణయాల ప్రభావం ఆయన మీద అంతగా ఉండక పోవచ్చు.

కొత్తగా..



రొమాంటిక్‌గా రాజా సాబ్

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రం నుంచి సోమవారం అప్డేట్ వచ్చింది. ఫ్యాన్ ఇండియా గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ప్రభాస్ వింటేజ్ లుక్‌లో ఛార్మింగ్‌గా కనిపించారు. రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే 40 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఆగస్టు 2 నుంచి మరో భారీ షెడ్యూల్ ప్రారంభించనున్నారు.

చిత్రం: రాజాసాబ్
ప్రొడ్యూసర్: టీజీ విశ్వ ప్రసాద్
డైరెక్టర్: మారుతి
బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ
నటీనటులు: నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్, యోగిబాబు తదితరులు

ఆగస్టులో భవనమ్



కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందిన హారర్ కామెడీ 'భవనమ్'. ఆగస్టు 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. నటుడు సప్తగిరి మాట్లాడుతూ 'సూపర్ గుడ్ ఫిల్మ్స్ బేనర్‌లో ఓ సినిమా చేయాలనే కల 'భవనమ్'తో నెరవేరింది' అన్నారు. ఇందులో కామెడీ యాక్షన్ సాంగ్స్ ప్రేక్షకులను అలరిస్తాయని షకలకశంకర్ చెప్పారు. సినిమాను చాలా గ్రిప్పింగ్‌గా తెరకెక్కించాం, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు బాలాచారి తెలిపారు.

చిత్రం: భవనమ్
ప్రొడ్యూసర్: ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి
డైరెక్టర్: బాలాచారి కూరెళ్ల
బ్యానర్: సూపర్‌గుడ్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్
నటీనటులు: సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, తాగుబోతు రమేశ్, మాళవిక సతీషన్ తదితరులు


ఉషా పరిణయ గాథ



ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే ప్రేమకథతో రూపొందిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సాయిదుర్గ తేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త నటీనటీలతో రూపొందుతున్న ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే, ఈ తరహా చిత్రాలు మరిన్ని వస్తాయి అని సాయిదుర్గతేజ్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా కుటుంబం మద్దతుతో ఈ చిత్రాన్ని నిర్మించాను. ధ్రువన్ మంచి సంగీతం అందించాడు' అన్నారు. అందరి సహకారంతో ఓ మంచి సినిమాను అందిస్తున్నాం, సినిమా చూస్తున్నప్పుడు ఎంజాయ్ చేస్తారు అని హీరో చెప్పారు. ఈ సినిమాతో నటిగా నాకు మంచి పేరు వస్తుందని హీరోయిన్ చెప్పారు.

చిత్రం: ఉషా పరిణయం
ప్రొడ్యూసర్: కె. విజయ్ భాస్కర్
డైరెక్టర్: కె. విజయ్ భాస్కర్
బ్యానర్: విజయ్ భాస్కర్ క్రాఫ్ట్ ప్రొడక్షన్
నటీనటులు: శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య

బడ్డీ టికెట్ ధరల తగ్గింపు



అడ్వంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'బడ్డీ'. ఆగస్టు 2న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో బడ్డీ సినిమా రేట్లను తగ్గిస్తున్నట్లు మేకర్స్ సోమవారం ప్రకటించారు. సింగిల్ స్క్రీన్లలో రూ. 99, మల్టీప్లెక్స్‌లో రూ. 125గా టికెట్ ధరలు నిర్ణయించారు. భారతీయ వెండితెరపైన ఒక సరికొత్త ప్రయోగంగా 'బడ్డీ' సినిమా నిలుస్తుందని ఈ సందర్భంగా మేకర్స్ తెలిపారు.

చిత్రం: బడ్డీ
ప్రొడ్యూసర్: కేఈ జ్ఞానవేల్ రాజా, అధన్ జ్ఞానవేల్ రాజా
డైరెక్టర్: శామ్ ఆంటోన్
బ్యానర్: స్టూడియో గ్రీన్ ఫిలింస్
కాస్టింగ్: అల్లు శిరీష్, గాయత్రి భరద్వాజ్, అజ్మల్ అమీర్, అలీ, ముఖేశ్ కుమార్ తదితరులు

సీనియర్ సినీ నిర్మాత సూర్యనారాయణబాబు కన్నుమూత



సీనియర్ నిర్మాత, మహేశ్‌బాబు మేనమామ ఉప్పలపాటి సూర్యనారాయణ బాబు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. సూపర్‌స్టార్ కృష్ణకు బావ అయిన సూర్యనారాయణ బాబు 'మనుషులు చేసిన దొంగలు', రామ్ రాబర్ట్ రహీమ్', 'సంధ్య', 'బెజవాడ రౌడీ' తదితర చిత్రాలు నిర్మించారు. రాజకీయాల్లోకి ప్రవేశించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుడివాడ నియోజక వర్గం నుంచి ఎన్టీఆర్ పై పోటీ చేసి ఓడిపోయారు. నటుడు విజయ్‌చందర్‌తో కలిసి ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా 'కలియుగ విశ్వామిత్ర' చిత్రాన్ని కూడా నిర్మించారు. సూర్యనారాయణ బాబు పార్థివ దేహాన్ని మంగళవారం ఉదయం కోకాపేటలోని మూవీ టవర్స్‌లో ఉంచి, ఆ తర్వాత మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు చెప్పారు.



తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ తమ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని దర్శక సంజీవని పేరుతో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ఉపాధ్యక్షుడు సాయి రాజేశ్, నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీసీఏ సమావేశాన్ని నిర్వహిస్తున్న జిల్లా జడ్జి పార్థసారథి

ఆవులను రోడ్లపై వదలకుండా చూడాలి

● జిల్లా జడ్జి వైవీఎస్‌బీజీ పార్థసారథి

గుంటూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆవులను వాటి యజమానులు రోడ్లపై వదలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా జడ్జి వైవీఎస్‌బీజీ పార్థసారథి మునిసిపల్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. సమాజంలో జంతువులపై క్రూరత్వ నివారణ(ఎస్.పి.సి.ఏ) చర్యలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని తన కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపైన ఆవులు తిరగడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రోడ్లపై ఆవులు తిరగకుండా ఏవిధమైన చర్యలు చేపడుతున్నారని మున్సిపల్ అధికారులను ఆయన ప్రశ్నించారు. ఆవులను వెంగళాయపాలెంలోని గోశాలకు తరలిస్తున్నామని, వాటి యజమానులు వచ్చినప్పుడు రిజిస్టర్‌లో ఫొటోతో కూడిన వివరాలు నమోదు చేసుకొని ఆవులను వారికి స్వాధీనం చేస్తున్నామన్నారు. అలాగే ఆవులకు ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు పశువైద్యులచే చికిత్స అందిస్తున్నామన్నారు. ఆవుల అక్రమ రవాణా జరగకుండా రవాణా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని, అక్రమరవాణాలో దొరికిన ఆవులను గోశాలకు తరలించాలన్నారు.

సొసైటి ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు యానిమాల్స్ (ఎస్.పి.సి.ఏ) కమిటీ సభ్యులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటుచేసుకొని పశువుల అక్రమ రవాణా, రోడ్లపై పశువులు సంచరించినా, మరేమైనా సంఘటనలు జరిగినా ఆ సమాచారాన్ని గ్రూప్ ద్వారా తెలియజేసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు కుక్కలను పట్టుకొస్తే వాటికి యాంటీరాబిస్ ఇంజెక్షన్ ఇచ్చి, సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసి విడిచిపెడతామని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి ప్రధాన న్యాయమూర్తికి తెలిపారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రెటరీ లీలావతి, జిల్లా పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ మోహన్‌రావు, గుంటూరు తూర్పు మండల తహసీల్దార్ రిజ్వాన్, ఎంవీఐ కే మల్లేశ్వరి, సౌజన్య, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.అమృతరాణి, పొన్నూరు మున్సిపాలిటీ మేనేజర్ టి.వెంకటరావు, జీఎంసీ బయాలజిస్టు ఎన్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 29: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రజలు అందరూ సుభిక్షంగా ఉన్నారని, ప్రజల శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా పాలన సాగుతోందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, గత ఐదేళ్ల పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు. గతంలో గ్రామాల్లో వైసీపీ నేతలు మద్యం, గంజాయి అమ్మకాలే వ్యాపారంగా పెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా పూర్తికాలేదని, అప్పుడే పథకాలు అమలుచేయడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. హామీ ఇచ్చిన ప్రతి పథకం అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పథకాలకు మొత్తం జగన్‌రెడ్డి పేర్లు మాత్రమే పెట్టుకున్నారని, ఎన్‌డీఏ ప్రభుత్వంలో మహోన్నత వ్యక్తుల పేర్లు పెట్టి వారిని గౌరవంగా చూస్తున్నామన్నారు.

టిడ్కో ఇళ్లను నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం

● వచ్చే మూడు నెలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం
● ప్రజల పన్నుల ఆదాయం కూడా వైసీపీ ప్రభుత్వం వాడేసింది
● మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

తుళ్లూరు, జూలై 29: వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తిగా నాశనం చేసిందని మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగునూరు నారాయణ అన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ పరిశీలించారు. ముందుగా మందడం సీడ్ యాక్సెస్ పక్కన కట్టిన టిడ్కో గృహాలను సందర్శించారు. అనంతరం దొండపాడులో టిడ్కో ఇళ్లను పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనపై లబ్ధిదారులతో మంత్రి నారాయణ మాట్లాడారు. ఇళ్లకు వచ్చే రోడ్లు సరిలేవని, నీటి సమస్య ఉందని మంత్రికి వివరించారు. ఒక్క రూపాయితో ఇళ్లు ఇస్తామని చెప్పిన జగన్‌రెడ్డి మోసం చేశాడని, రుణభారం తగ్గించాలని లబ్ధిదారులు వేడుకున్నారు. గృహ సముదాయాలను, పరిసరాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా దొండపాడులో మీడియా సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడారు. ప్రతి మహిళ తన కుటుంబంతో ఆనందంగా గడిపేలా టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. వచ్చే మూడు నెలల్లో టిడ్కో ఇళ్లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాజధాని రైతులకు త్వరలోనే కౌలుడబ్బులు విడుదల చేస్తామని చెప్పారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను బ్యాంకులు ఇబ్బంది పెట్టకుండా గడువు పెంచాలని కోరతామన్నారు. రైతుల ప్లాట్లకు లోన్ ఇచ్చేలా బ్యాంకర్స్‌తో మాట్లాడమని చెప్పారు. రాజధాని పనులు వేగవంతం అవుతాయని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లకు నాసిరకం రంగులు వేసిందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. అంతర్గత రోడ్లు కూడా నాణ్యత లేవన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు ఎర్రగోపు నాగరాజు, తాడికొండ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు, మూడు పార్టీల నాయకులు పాల్గొన్నారు.





టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

శీతల గిడ్డంగుల్లో రంగు మారుతున్న మిర్చి

● ఏడాది క్రితం నిల్వ చేసిన టిక్కీలలోకి ఫంగస్ కూడా చేరిక
● తాలుకాయల కింద అమ్ముకోవాల్సిన దుస్థితి

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మిర్చి మార్కెట్‌లో ధర పతనమైన కారణంగా గత ఏడాది శీతల గిడ్డంగుల్లో నిల్వచేసిన ఎండు మిరపకాయలు రంగు మారిపోతున్నాయి. ధర పెరిగే పరిస్థితి లేకపోవడంతో వచ్చిందే దక్కుదల అని భావిస్తూ రైతులు, వ్యాపారులు కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి టిక్కీలు బయటకు తీస్తుంటే వాటిల్లోని మిర్చి నలుపు రంగులోకి మారిపోయి ఉంటోంది. నెలల తరబడి ఒకే లాట్‌లో ఉండటం వలన ఫంగస్ కూడా చేరుతున్నది. దీంతో వాటిని మార్కెట్‌యార్డులో విక్రయించేందుకు తీసుకొస్తే క్వింటాల్‌కు కనీసం రూ.8వేలు కూడా ధర రావడం లేదు. దీంతో మిర్చి స్టాకిస్టులు బావురుమంటున్నారు. ఇందుకు కారణం కోల్డ్‌స్టోరేజ్‌లలో మిర్చి నిల్వ చేసినప్పుడు క్వింటాల్ ధర రూ.18 వేల నుంచి రూ.20వేల మధ్యన ఉండటం. ఇప్పుడు ధర సగానికి సగం తగ్గిపోవడమే కాకుండా అదనంగా కోల్డ్‌స్టోరేజ్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తుండటంతో తీవ్రంగా నష్టాలను చవి చూస్తున్నారు.

2023 మార్చి నుంచి మే నెలల మధ్యన మిర్చి ధర మార్కెట్‌లో తగ్గింది. అంతకుముందు వరకు క్వింటాల్ ఒక దశలో రూ.27వేల వరకు వెళ్లింది. అయితే ఉన్నపళంగా క్వింటాల్‌కి రూ.7వేలకు పైగా ధర తగ్గడంతో అప్పట్లో రైతులు, వ్యాపారస్థులు కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేశారు. గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల వరకు వేచిచూసినా ధర పెరగలేదు. మరోవైపు కొత్త సరుకు రావడం ప్రారంభమైంది. అప్పట్లో దాదాపుగా 35 లక్షల టిక్కీల వరకు స్టోరేజ్‌లలో నిల్వ చేయగా గత సంవత్సరం డిసెంబరు నెల వరకు 15 లక్షల టిక్కీలను ధర తక్కువ అయినా రైతులు విక్రయించేశారు. మరో 20 లక్షలు మాత్రం అలానే స్టోరేజ్‌లలో నిల్వ ఉండిపోయాయి. ఈ ఏడాది(2024) మే నెల వరకు మరో 50 లక్షల టిక్కీలను రైతులు నిల్వ చేశారు. దీంతో ప్రస్తుతం 70 లక్షల టిక్కీలు గిడ్డంగుల్లో ఉన్నట్లు మార్కెట్ కమిటీ అధికారులు వివరాలు సేకరించారు.

కాగా గత ఏడాది నిల్వచేసిన వాటిని ఇప్పుడు ఎంత ధర వస్తే అంతకు విక్రయించేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధర కూడా వాటికి లభించడం లేదు. ఇందుకు కారణం నాణ్యత లోపించడమే. మిర్చి ఎప్పుడైనా ఎర్రరంగులో ఉంటేనే ఎగుమతిదారులు కొనుగోలు చేస్తారు. అయితే స్టోరేజ్‌లలో గత ఏడాది నిల్వ చేసినవి నలుపు రంగు తిరిగింది. సహజంగా స్టోరేజ్‌లలో లాట్‌లలోని టిక్కీలను తిరగేస్తుండాలి. అయితే ఎలా పెట్టినవి అలానే కదిలించకుండా ఉంచడంతో చాలా టిక్కీల్లోకి ఫంగస్ చేరిపోయింది. దీంతో వాటిని కొనుగోలు చేయడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఒక విధంగా తాలుకాయల కింద లెక్కకట్టి వాటిని క్వింటాల్ రూ.8వేలకు కొంతమంది కొనుగోలు చేస్తున్నారు. దీనివలన క్వింటాల్‌కి ఒక్కో రైతు రూ.10 వేలకు పైగానే నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా రాబోయే మూడు నెలల్లో ప్రస్తుతం కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ ఉన్న 70 లక్షల టిక్కీల్లో సింహభాగం విక్రయం జరగకపోతే నవంబరు నెల నుంచి కొత్త పంట వస్తుంది. అప్పుడు రైతులు మరింతగా నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ అధికారులు రైతుల పక్షాన నిలిచి తరచుగా ఎక్స్‌పోర్టర్లతో సమావేశాలు నిర్వహించి కొనుగోళ్లు పెరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

గిరిజన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత

● ఘర్షణలో గాయపడ్డ రేంజర్ సత్యనారాయణరెడ్డి
● ఫారెస్ట్ అధికారుల దాడిలో గాయపడ్డ గిరిజన మహిళ

వెల్దుర్తి, జూలై 29: మండలంలోని హనుమాపురంతండాకు చెందిన ఓ గిరిజన వ్యక్తిని ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సంఘటనలో ఫారెస్ట్ రేంజర్‌తోపాటు ఓ గిరిజన మహిళకు గాయాలయ్యాయి. అధికారులు జరిపిన లాఠీచార్జిలో పలువురు గిరిజనులు గాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని హనుమాపురంతండాకు చెందిన గోవిందునాయక్ అటవీ ఉత్పత్తులతోపాటు జంతువులను అక్రమ రవాణా చేస్తున్నట్లు భావించి ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం హనుమాపురంతండాకు చేరుకున్న అధికారులు గోవిందునాయక్ ఇంటితోపాటు మరికొన్ని ఇళ్లలో సోదాలు జరిపారు. గోవిందునాయక్ ఇంట్లో రూ. 5 లక్షల మేర నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అటవీ ఉత్పత్తుల అక్రమ రవాణా చేసి ఈ నగదు అందుకున్నట్లు ఫారెస్ట్ అధికారులు భావిస్తున్నారు. కాగా ఆ సమయంలో గోవిందునాయక్ ఇంట్లో లేడు. సోమవారం గోవిందునాయక్‌ను మండలంలోని గొట్టిపాళ్లలో ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడ ఉన్న కొందరు గిరిజనులు ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో చెప్పాలంటూ భీష్మించారు. దీంతో ఫారెస్ట్ అధికారులు లాఠీచార్జి చేయడంతోపాటు మహిళలపై దాడులకు తెగబడ్డారని బాధితులు వాపోయారు. ఈ సంఘటనలో కేతావత్ విజయబాయికి గాయాలు కావడంతో మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విజయబాయి పొట్టపై తన్నడంతోనే గాయమైనట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మరికొంతమంది గిరిజనులు గంగలకుంట వద్ద అధికారుల వాహనాన్ని అడ్డగించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అటవీ అధికారులు మరోమారు లాఠీచార్జికి దిగారు. ఆగ్రహించిన గిరిజనులు ఫారెస్ట్ అధికారుల వాహనంపై రాయి విసరడంతో వాహనం అద్దం పగిలి వాహనంలో ఉన్న రేంజర్ సత్యనారాయణరెడ్డి చేతికి గాయమైంది. కాగా ఈ సంఘటనలపై ఫారెస్ట్ అధికారులు వివరాలు వెల్లడించడం లేదు. గోవిందునాయక్‌తోపాటు మరో నలుగురిని అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.



గిరిజనులపై లాఠీచార్జి చేస్తున్న ఫారెస్ట్ అధికారులు



గాయాలపాలైన రేంజర్ సత్యనారాయణరెడ్డి



మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో విజయబాయి

కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

పెదకాకాని, జూలై 29: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ విధానంలో నాన్ టీచింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారు నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏర్పాటుచేశారు. ఈ కార్య వర్గానికి అధ్యక్షుడిగా కంకణాల వెంకట సుధీర్, కార్యదర్శిగా డాక్టర్ దొడ్డక శివరామకృష్ణ, కోశాధి కారిగా లంకపల్లి సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా టి.సుబ్రమణ్యం, సయ్యద్ అనీషాబేగం, జాయింట్ సెక్రటరీస్‌గా ఎం.శిరీష, జి.రజత, ఎల్.సౌమ్య, కార్యవర్గసభ్యులుగా యు.అన్నామని, జి.శాంతరాజు, ఏ మణి, కే కిషోర్, ఎం.అన్నపూర్ణాదేవి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ కార్యవర్గానికి గౌరవ అధ్యక్షులుగా వికాస అధ్యక్షుడు టి.అనిల్ కుమార్, గౌరవకార్యదర్శిగా వికాసకార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, సలహాదారులుగా కనకరాజు, అజయ్‌బాబులను ఎన్నుకొన్నట్లు నూతన అధ్యక్షుడు వెంకట సుధీర్ తెలిపారు.

విజయసాయిరెడ్డి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 29: మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. వినుకొండ సింగర చెరువు సందర్శనలో భాగంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయసాయిరెడ్డి నోరు తెరిస్తే అన్నీ అసత్యాలు, అబద్ధాలు, గోబెల్ ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. విజయసాయిరెడ్డి ట్విట్టర్లో టీడీపీపై చేస్తున్న విమర్శలు మానుకోవాలన్నారు. కులాల సంప్రదాయం తెచ్చింది జగన్‌రెడ్డేనన్నారు. నామినేటెడ్ పదవులన్నీ వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరెడ్డి, ధర్మారెడ్డి, జవహర్‌రెడ్డి ఇలా ఒకే సామాజిక వర్గానికే ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు, మిగిలిన సామాజికవర్గాలకు మీరు ద్రోహం చేశారని, అందుకే అన్ని వర్గాల ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డిని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా సిగ్గు రాలేదన్నారు. వివిధ కీలక పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో సీఎం చంద్రబాబునాయుడు అన్ని వర్గాలకు న్యాయం చేస్తుంటే విజయసాయిరెడ్డి, జగన్‌రెడ్డి ఓర్వలేక అసత్య ప్రచారాలు చెయ్యడం సిగ్గుచేటన్నారు.

పథకాలకు మహనీయుల పేర్లపై హర్షం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు మంత్రి నారా లోకేశ్ మహనీయులు పేర్లు నామకరణం చెయ్యడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ, లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సంక్షేమానికి అందచేస్తున్న పథకానికి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్రగా, మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ, విద్యార్థులకు ప్రతిభా పురస్కారం పథకానికి ఏపీజే అబ్దుల్ కలాం... ఇలా ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం కూటమి ప్రభుత్వం గొప్పతనం అన్నారు. ఒక్కసారి ప్రజలు అవకాశం ఇస్తే జగన్‌రెడ్డి, అన్ని సంక్షేమ పథకాలకు తన పేర్లు పెట్టుకుని లక్షల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. 1వ తేదీన లబ్ధిదారులు ఇంటి వద్ద ఉండి పింఛన్ తీసుకోవాలని వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు జీవీ సూచించారు. సచివాలయ ఉద్యోగులు ఇంటివద్దకే వచ్చి పింఛన్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పలువురు వైసీపీ కౌన్సిలర్లు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 29: పలువురు మున్సిపల్ వైసీపీ కౌన్సిలర్లు, కౌన్సిలర్ల కుటుంబసభ్యులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరు సోమవారం గుంటూరులో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో 8వ వార్డు కౌన్సిలర్ గెల్లిపోగు జగన్‌మోహన్‌రెడ్డి, 9వ వార్డు జగన్నాథం శివయ్యతోపాటు పదో వార్డు కౌన్సిలర్ సిద్ధమ్మ భర్త సిద్ధయ్య, రెండో వార్డు కౌన్సిలర్ షేక్ జాన్‌బీ భర్త నాగుల్‌మీరా, ఐదో వార్డు కౌన్సిలర్ కలివెల జ్యోతి భర్త కిషోర్, ఏడో వార్డు రామగాని రమణి భర్త శంకర్, 11వ వార్డు కౌన్సిలర్ బుట్టి శ్యామలజ్యోతి భర్త చంద్ర, 24వ వార్డు తాళ్ల గోవర్ధని మామ కొండలు ఉన్నారు.

పాటిబండ్ల కొండపై శాసనం



పాటిబండ్ల మల్లేశ్వరస్వామి కొండపై శాసనం

పెదకూరపాడు, జూలై 29: మండలంలోని పాటిబండ్ల కొండపై ఉన్న మల్లేశ్వర స్వామి ఆలయ ప్రవేశద్వారం పక్కన కొత్త శాసనం ఉందని, పురావస్తు ఔత్సాహిక పరిశోధకులు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి, మనిమేల శివశంకర్‌లు మంగళవారం తెలిపారు. కారుణ్య ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ అల్లం ఇన్నారెడ్డి గ్రామ చరిత్ర పై పుస్తకరచనలో భాగంగా సమాచారం కోసం వారితో కలసి పురాతన ఆలయాలు, కట్టడాలను పరిశీలించినట్టు తెలిపారు. కొండపై ఉన్న శాసనం 17-18వ శతాబ్దం నాటిదని, ఈ శాసనంలో గోపాపాత్రుడి కుమారుడైన కొండముదు అనే వ్యక్తి గుర్రాన్ని కొండ పడమటి దిక్కుగా ఎక్కించి తూర్పు దిక్కుగా వెళ్ళేవారని శాసనంలో ఉందని తెలిపారు. క్రీస్తు పూర్వం 2000 సంవత్సరం కొత్త రాతియుగం నాటి రాతి పనిముట్లు, 14 శతాబ్దం నాటి మహిషాసుర మర్దని విగ్రహం, 16వ శతాబ్దం నాటి ఆంజనేయ విగ్రహాన్ని గుర్తించినట్టు వివరించారు. పురాతన ఆనవాళ్ళను భద్రపరిచి భావితరాలకు అందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ ఆచంట రాము తదితరులు ఉన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల పేరు మార్చాలి

● టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

పెదకాకాని, జూలై 29: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల పేర్లు గత ప్రభుత్వం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీగా ఏకపక్షంగా మార్చింది. ఆ పేరు తొలగించాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్కిటెక్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, సీఎం చంద్రబాబునాయుడుని దుర్భాషలాడారని, ప్రభుత్వం మారినా తన తీరు మార్చుకోకుండా ఇప్పటికీ వైసీపీ కార్యకర్తలా పనిచేస్తున్నారని తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల సిద్ధయ్యది కూడా అదే తీరని, వీరిద్దరినీ వర్సిటీ నుండి తీసివేయాలని డిమాండ్ చేశారు. దానికి వైస్ చాన్సలర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బత్తుల హేమంత్, రాష్ట్ర నాయకులు కొర్రపాటి అభిషేక్, ప్రధాన కార్యదర్శి హరీష్, ఉపాధ్యక్షులు శిరీష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు


అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల పోరాటానికి మద్దతు

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ● రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఉద్యోగుల ధర్నా

గుంటూరు(తూర్పు), జూలై 29: ప్రకృతి వ్యవసాయ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు గత 16 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి జీతాల చెల్లింపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రైతు సాధికారిక సంస్థ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గుంటూరు, గోరంట్ల వద్ద ఉన్న రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఉద్యోగులు భారీనిరసన చేపట్టారు. ధర్నాకు మద్దతు తెలిపిన కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ దేశవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పిన హామీ ప్రకారం ఉద్యోగులకు కూడా బడ్జెట్ కేటాయించాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీల ఫోరం తరఫున మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. రైతు సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై రాధాకృష్ణమూర్తి, కె.హరిబాబు మాట్లాడుతూ పథకాన్ని సమర్థవంతం గా నిర్వహించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగుల జీతభత్యాలు చెల్లింపులో ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోకపోవడం సరైందికాదన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు మాట్లాడు తూ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించేందుకు కూడా ప్రభుత్వాలు సహకరించకపోవడం అన్యాయమన్నారు. ధర్నా అనంతరం రైతు సాధికారసంస్థ సీఈవో రామారావుకు వినతిపత్రం అందజేశారు. నాలుగైదు నెలల జీతాలు ఆగస్టు నెలలో చెల్లిస్తామని మిగిలిన బకాయి మొత్తాన్ని అక్టోబరు నాటికి పూర్తిగా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఈవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, వరప్రసాదు, సీఐటీయూ నాయకులు వై.నేతాజీ, వైరగాని శ్రీనివాస్, ఐ.వెంకటేశ్వర్లు, పాండురంగారావు, ప్రసాద్ పాల్గొన్నారు.



రైతు సాధికార సంస్థ సీఈవో రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

36,353 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 40,891 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 36,353 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 15,748 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	16000	334	10800	14000
నెంబరు. 5	9500	12000	నెంబరు. 5	9500	10500
273	10000	11300	273	--	--
341	8500	14500	341	10000	15000
4884	15500	16000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18500	తేజ	9000	18400
బ్యాడిగి	8500	15000	బ్యాడిగి	9000	15500
దేవనూరుడీలక్స్	8500	12800	దేవనూరుడీలక్స్	10000	11000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11500

పెండింగ్ సమస్యలు గుర్తించాలి : జేసీ బి.సుబ్బారావు



జాతీయ రహదారి 167ఏ గురించి అధికారులతో సమీక్షిస్తున్న జేసీ బి.సుబ్బారావు

బాపట్ల, జూలై 29 : ఓడరేవు నుంచి పిడుగురాళ్ళ వేళ్లే 167ఎ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను గుర్తించి నివేదిక ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. బాపట్ల, చీరాల ఆర్డీవోలు, తహసీల్దార్‌లు, వివిధశాఖల అధికారులతో సోమవారం ఈ విషయమై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ వివరాలను తెలియజేయాలన్నారు. జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనకరమైన ఈ రహదారి నిర్మాణానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో గుర్తించి నివేదించాలన్నారు. సమావేశంలో బాపట్ల, చీరాల ఆర్డీవోలు గంధం రవీందర్, సూర్యనారాయణ రెడ్డి, తహసీల్దార్‌లు, హైవే, ఫారెస్ట్, అగ్రికల్చర్, హార్టికల్చర్, గ్రౌండ్‌వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

కాల్వకట్టలపై జీవించే వారికి నివేశన స్థలాలివ్వాలి

● రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్

బాపట్ల, జూలై 29 : అనాధిగా కాల్వకట్టలపై పాకలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగించే యానాదులకు నివేశన స్థలాలు ఇవ్వాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ డిమాండ్ చేశారు. బాపట్ల మండలం కొండుభొట్లపాలెంలో నల్లమడడ్రైన్ కట్టపై జీవనం సాగిస్తున్న యానాదులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన మేకల ప్రసాద్ మాట్లాడుతూ యానాదులకు 35 కిలోల బియ్యం కార్డులు ఇవ్వాలని, ఉపాధి కోసం గొర్రెలు, మేకలు, పాడిగేదెలు గోకులం పథకం కింద ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కె.సీత, పాలేపె వెంకాయమ్మ, మచ్చా సత్యమ్మ, కొమరగిరి రమణమ్మ, పాలెపు బుల్లెమ్మ, కోనేటి గంగ, వెంకటేశ్వరమ్మ, బాధిత కుటుంబావారు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు ప్రజాసమస్యల పరిష్కార వేదికగా విజ్ఞప్తి చేశారు.

ఉపాధి హామీ నిధులు కేటాయించాలి

కొల్లూరు, జూలై 29 : మండల పరిధిలోని తోకలవానిపాలెం గ్రామంలో ఉన్న పంచాయితీ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనానికి సహకరించాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించి తమ గ్రామానికి పంచాయతీ భవనం ఏర్పాటు చేయాలని పంచాయతీ డైరెక్టర్ కృష్ణ తేజ గారిని కలిసి వినతిపత్రం అందించినట్లు చెప్పారు.

మండలాధికారి అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

● ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడిని కోరిన ఏఎన్ఎంలు



అసోసియేషన్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

బాపట్ల, జూలై 29 : చాట్‌యాప్ గ్రూప్‌లో ఒక మండలాధికారి ఏఎన్ఎంలను కించ పరిచేవిధంగా వ్యాఖ్యానించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. సదరు వ్యక్తి జాబ్‌చార్ట్‌ను కించపరిచే విధంగా ఏఎన్ఎంల మనోభావాలను దెబ్బతీసేవిధంగా 'నాటకాలు వేయవద్దు' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని వారు ఆరోపించారు. ఈ విషయమై సోమవారం తన సమస్యను ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావుకు వినతిపత్రం ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు పి.సంధ్యారాణి, సీహెచ్ సునీత, విజయలక్ష్మి, జె.జయశ్రీ, అసోసియేషన్ కార్యదర్శి జి.ఇస్సాకు, కోశాధికారి తదితరులున్నారు.

విద్యార్థులకు శుభతిథి భోజనం కార్యక్రమం



విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేస్తున్న డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, తల్లిదండ్రులు

పిట్టలవాని పాలెం, జూలై 29 : మండలపరిధిలోని సంగుపాలెం గ్రామ పంచాయతీలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం శుభతిథి భోజన కార్యక్రమంలో భాగంగా పిట్టలవానిపాలెం తెలుగుమహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేటి సోపాటి విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులకు అందించే బోజన కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్లోరియానేట్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం, జూలై 29 : మండలంలోని చందోలు నీలి బంగారయ్య జిల్లాపరిషత్ ఉన్నత పరిషత్ పాఠశాలలో విద్యభ్యసించే విద్యార్థులకు సోమవారం పిట్టలవానిపాలెం టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ ఆయన మిత్ర మండలి సహకారంతో శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాలలోని విద్యార్థులకు భోజన వసతుల ఏర్పాట్లు చేశారు.

బాపట్ల, జూలై 29 : శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు స్వీట్‌లు, పండ్లు పంపిణీ చేశారు. చైతన్యమిత్రమండలి సభ్యులు పి.సుదర్శన్, రాజా, నాళం శ్రీనివాసరావు, పిఎమ్ పోషణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేద ముస్లిం విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

చుండూరు, జూలై 29 : యడ్లపల్లికి చెందిన జనాబ్ కంపెనీ ఇమామ్ జాన్ చారిటబుల్ ట్రస్ట్ 18వ వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం పేద ముస్లిం విద్యార్థులకు ఉపకార వేతనా లు, పుస్తకాలు పంపిణీ చేశారు. మండల గ్రామాల్లో తెనాలి పట్టణంలోని 10వ తరగతిలో అత్యధిక మార్కులు పొందిన 10 మంది విద్యార్థులకి రూ.70 వేల నగదు, 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పఠాన్ ఖాసీంఖాన్, ముస్లిం పెద్ద లు, ట్రస్ట్ సభ్యులు అబ్దుల్లాఖాన్, మొహిద్దీన్, జాన్‌సైదాఖాన్, బీటీ ఖాన్, జాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

అరవపల్లి డ్రెయిన్‌లో తూటికాడ తొలగింపు

ఎఫెక్ట్



అరవపల్లి డ్రెయిన్‌లో పొక్లెయిన్లతో తూటికాడ తొలగింపు

రేపల్లె, జూలై 29: ఎట్టకేలకు డ్రెయినేజీ అధికారులు స్పందించి మండలంలోని అరవపల్లి డ్రెయిన్‌లో తూటికాడ తొలగింపునకు స్వీకారం చుట్టారు. ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషనల్‌లో తూటికాడను తొలగించాలంటూ డ్రెయిన్‌ల నిండా పేరుకుపోయిన గుర్రపుడెక్క అనే శీర్షికకు డ్రెయినేజీ అధికారులు స్పందించారు. సోమవారం అరవపల్లి డ్రెయిన్‌లో తూటికాడ ప్రొక్లెయిన్‌ల ద్వారా తొలగింపు పనులు ప్రారంభించారు. రైతులు మాత్రం పూర్తి గా నీరు నిలిచి ఉంటే నామమాత్రంగా తీసి చేతులు దులుపుకునేందుకు ఇప్పటి వరకు ఆలస్యం చేశారంటూ సమీప పొలాల రైతులు ఆరోపిస్తున్నారు. తూటికాడను కూడా డ్రెయిన్‌కు రెండువైపులా తొలగించకుండా ఒక వైపే తొలగిస్తున్నారంటూ ఏటా అరవపల్లి డ్రెయిన్ వంతెన సమీపంలో అటు వంద మీటర్లు ఇటు వందమీటర్లు తూటికాడ తొలగించి అటు గుత్తేదారులు, కాంట్రాక్టదారులు,అధికారులు కుమ్మక్కై లక్షలాది రూపాయలు సొమ్ముచేసుకుంటున్నారు. ఈ విషయంపై ప్రతి సంవత్సరం రైతులు డ్రెయినేజీ కార్యాలయంలో ఫిర్యాదులు చేసిన పట్టించుకోవటం లేదంటూ మునుసుబుబారిపాలెంకు చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీలో పూడికలు పూర్తిస్థాయిలో తీయకుంటే నిరసనకు దిగాల్సి వస్తుందని తెలుపుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి పెనుమూడి నుంచి గుడ్డికాయలంక లాక్‌ల వరకు పూర్తిస్థాయిలో గుర్రపుడెక్క, తుంగ, తొలగించాలని రైతులు కోరుతున్నారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వారు ది.21-07-2024న ప్రచురించిన **పోడబత్తిని వెంకటేశ్వరమ్మ** గారి యాడ్‌లో బ్రాంచ్ పేరు **రేపల్లె** అని తప్పుగా పడినది దీనిని **పొన్నూరు** గా చదువు కొనగలరు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళీ

బాపట్ల, జూలై 29 : ప్రజాసమస్యలపై అధికారులు సత్వరమే స్పందించాలని కలెక్టర్ జె.వెంకటమురళీ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు జిల్లా నలుమూలల నుంచి సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ప్రజలు నుంచి వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు చెప్పారు. తన పరిధిలో వాటికి తక్షణమే పరిష్కారమార్గం చూపగా మిగిలినవాటిని పరిశీలన మరికొన్నిటిని విచారించాలని అధికారులను ఆదేశించారు. మహిళా శిశుసంక్షేమశాఖ పరిధిలో 7, రేపల్లె ఆర్డీవో పరిధిలో 6, చీరాల ఆర్డీవో పరిధిలో 2 అర్జీలు పెండింగ్‌లో ఉండటం పై కలెక్టర్ ఆరా తీశారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి రాష్ట్రప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందనే విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. అధికారులు నిర్లిప్తంగా విధులు నిర్వహిస్తే కుదరదన్నారు. చిత్తశుద్ధితో పనులు చేయాల ని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, జిల్లా రెవెన్యూఅధికారి సీహెచ్.సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అంటరానితన నిర్మూలన పోరాటసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక కోరారు. ఈ విషయమై సోమవారం దళిత సంఘాల నాయకులతో కలిసి ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ జె.వెంకటమురళీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గొర్రెముచ్చు వందనం, కాగిత కోటేశ్వరరావు, గుదే రాజారావు, తురిమెళ్ళ అమ్మేశ్వరరావు, జి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాల పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలి

● గొట్టిముక్కల బాలాజి

రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు తక్షణమే పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి జాయింట్ సెక్రటరి గొట్టిముక్కల బాలాజి కోరారు. ఈ విషయమై కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ సంఘ ఎన్నికలు 11 సంవత్సరాలు క్రితం జరిగాయన్నారు. చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. నేతన్న నేస్తం పథకాన్ని 24వేల నుంచి 36వేలకు పెంచి సొంత మగ్గం ఉన్నవారితోపాటు అద్దె మగ్గాల్లో పనిచేసే వారికి కూడా ఉత్పత్తులు వర్తింప చేయాలన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి వృత్తి పరికరాలను సబ్సిడీతో పంపిణీ చేయాలన్నారు. రాష్ట్రబడ్జెట్‌లో 1000 కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు మర్రివాడ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మోటుపల్లి చారిత్రక సంపదను కాపాడాలి

మోటుపల్లి చారిత్రక సంపదను కాపాడాలని కోరుతూ సోమవారం కలెక్టర్ జె.వెంకటమురళీకి మోటుపల్లి హెరిటేజ్ సొసైటీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోటుపల్లి ఆలయాలు, శాసనాలు శిథిలావస్థలో ఉన్నాయని వీటిని భద్రపరిచి భావితరాలకు అందించాలని కోరారు. మోటుపల్లిని పెద్ద పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి దాని ఘనతను చాటాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆర్ దశరథరామిరెడ్డి, ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు, విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు, వి.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ కార్యాలయానికి స్థలం కోరుతూ వినతి

బాపట్ల జిల్లా సీనియర్ సిటిజన్స్ కార్యాలయం కోసం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గండూరి వీరబ్రహ్మం సభ్యులతో కలిసి మాట్లాడుతూ చెరువుజమ్ములపాలెం ఆర్‌వోబీ కింద ఉన్న ఒక ఖానాలో కార్యాలయం పెట్టుకునేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు కాగిత శ్రీహరిరావు, బొలగాని వెంకటేశ్వర్లు, పీసీ సాయిబాబు, దేవవరం మామిడాల రామాంజనేయులు, కాళీదాసు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైద్యకళాశాల నిర్మాణంపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూలై 29 : వైద్యకళాశాల నిర్మాణంపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కలెక్టర్ జె.వెంకటమురళీ ఆదేశించారు. వైద్యకళాశాల నిర్మాణంపై సంబంధిత వైద్య, ఆరోగ్యశాఖాధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నిజాంపట్నం హర్బర్, ఓడరేవుహర్బర్, నిజాంపట్నంసెజ్, చేనేతపార్క్ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. వైద్యకళాశాల ద్వారా బాపట్లజిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు తలమానికంలా 505 కోట్ల రూపాయలతో వైద్యకళాశాల మంజూరైందన్నారు. నాబార్డు నిధులు, రాష్ట్రప్రభుత్వ నిధులతో నిర్మించేలా ఆమోద ముద్ర లభించిందన్నారు. మదటి దశలో 297 కోట్ల రూపాయలు మంజూరయ్యాయన్నారు. అందులో నాబార్డు నుంచి 252 కోట్లు మంజూరు కాగా 45కోట్లు నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. 100సీట్లతో వైద్యకళాశాల 450బెడ్‌లతో ఆస్పత్రి నిర్మించాలని ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 51ఎకరాలు వైద్యకళాశాలకు భూమి కేటాయించగా 15ఎకరాలలో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మెగా ఇంజనీరింగ్ వర్క్స్ ఏజెన్సీ ద్వారా నిర్మాణ పనులు జరుగుతుండగా 15శాతం పనులు జరిగాయన్నారు. ప్రస్తుతం 70కోట్లు విలువైన పనులు జరిగాయని 20కోట్లు వరకు బిల్లులు చెల్లింపులు జరిగాయన్నారు. కేంద్రప్రభుత్వం సహకారంతో పనులు జరుగుతున్నాయన్నారు. భావితరాలకు ఉపయోగపడేలా వైద్యకళాశాల, ఆస్పత్రి నిర్మిస్తున్న విషయాలను ఆయన గుర్తుచేశారు. సమగ్రనివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. సమావేశంలో ఏపీఎంఐడీసీ ఈఈ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, డీసీహెచ్ఎస్ కోఆర్డినేటర్ శేషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణ పనులు జరిగేనా..?

● వెళ్ళిపోతున్న యంత్రాలు

బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణ పనులపై అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఆర్భాటంగా శంకుస్థాపన చేసి ప్రారంభించిన పనులు నత్తనడకన జరుగుతూ వచ్చాయి. ప్రభుత్వం మారిన తర్వాత నిర్మాణ పనులను నెమ్మదిగా తగ్గిస్తూ వచ్చారు. ఇక్కడ పనిచేసే వర్కర్లు సైతం విడతలవారిగా వెళ్ళిపోతున్నారు. వైద్యకళాశాల నిర్మాణ పనులపై కలెక్టర్ సమీక్ష చేసిన రోజే యంత్రాలు మొత్తం తీసుకెళ్లటం ప్రారంభించారు. కేవలం 15శాతం పనులు మాత్రమే పూర్తికావటం సుమారుగా 50కోట్ల రూపాయల బిల్లులు రావాల్సి ఉంది. దీంతో గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఈ పనులకు ఈ ప్రభుత్వంలో బిల్లులు వస్తాయో లేదో అనే అనుమానంతో పనులు నిలిపివేశారనే ప్రచారం జరుగుతున్నది. పైగా ప్రతిరోజు ఇక్కడ ఉపయోగించే యంత్ర పరికరాలు, సామగ్రి తరలించటాన్ని చూస్తే నిర్మాణ పనులపై మీమాంస నెలకొని ఉంది.

అక్రమంగా బుసకను తరలిస్తే చర్యలు తప్పవు

● జిల్లా మైనింగ్ అధికారులు

బాపట్లరూరల్, జూలై 29 : బాపట్ల మండలంలో అక్రమంగా తరలిస్తున్న మూడు బుసక ట్రాక్టర్లను సోమవారం స్వాధీనం చేసుకొని సీజ్ చేసిన జిల్లా మైనింగ్ అధికారులు సీజ్ చేసిన మూడు ట్రాక్టర్లను బాపట్ల మండలం వెదుళ్ళపల్లి పోలీస్‌స్టేషన్ నందు అప్పజెప్పిన జిల్లా మైనింగ్ అధికారులు మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఎవరైన అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా జరిపిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని వివరించారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

బాపట్ల, జూలై 29: పట్టణంలోని సరాలాశెట్టివారిపాలెంకు చెందిన బొగ్గవరపు చంద్రశేఖర్ ఆయన భార్య సౌజన్య కనిపించటంలేదంటూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపిన వివరాలు ప్రకారం చంద్రశేఖర్ ఈ నెల 27వ తేదీ సాయంత్రం తమ ఇద్దరు పిల్లల్ని స్కూల్ నుంచి తీసుకురావటానికివెళ్ళి వచ్చేసరికి భార్య ఇంటి వద్ద లేదు. దీనిపై విచారించిన ఆయన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

పిట్టలవానిపాలెం, జూలై 29: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని చందోలు ఎస్ఐ టి.అనీల్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని రెడ్డిపాలెం హైవేటోల్ ప్లాజా వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు.

ఘర్షణపై పరస్పర కేసులు నమోదు

కొల్లూరు, జూలై 29 : ఘర్షణ పడి దాడి చేసుకున్న ఘటనపై పరస్పర కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జువ్వలపాలెం గ్రామానికి చెందిన దోవ సుబ్బారావు ఆదివారం రాత్రి తన ఇంట్లో ఐదేళ్ల క్రితమే తనను వదిలి వెళ్లిన భార్య గురించి దూషిస్తుండటంతో పక్కింట్లో ఉంటున్న భూపతి దయామణి, మణిశంకర్‌లు అతను తమనే దూషిస్తున్నాడంటూ అతనిపై దాడి చేశారు. సుబ్బారావు వైద్యశాలలో చికిత్స చేయించుకుం టూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా దయామణి కూడా తాను పొలం నుంచి వస్తుండగా సుబ్బారావు తనపట్ల అసభ్యంగా ప్రవర్తించి తలపై గాయపరిచాడని వైద్యశాలకు చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండు ఫిర్యాదులపై కేసు లు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఏడీఏగా ఆర్ విజయబాబు



ఆర్ విజయబాబు

రేపల్లె, జూలై 29: రేపల్లె సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఇన్‌చార్జ్(ఏడీఏ)గా ఆర్ విజయబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌సీజన్‌లో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్, ఎంపీఈవోలు రైతులకు అందు బాటులో ఉంటూ వ్యవసాయానికి సంబంధించిన సూచనలు రైతులకు చేరవేయ్యాలని సూచించారు.

31న పాలిటెక్నిక్ విద్యార్థులకు అడ్మిషన్లు

రేపల్లె, జూలై 29: తీరప్రాంతంలోని రేపల్లె పాలిటెక్నికల్ కళాశాల నందు ఈనెల 31వతేదిన స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయ న మాట్లాడుతూ 10వతరగతి పాసైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. మెకానికల్ ఎల క్ట్రానిక్స్, సివిల్, కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. అడ్మిషన్లకు వచ్చే విద్యార్థులు 10వతరగతి సర్టిఫికెట్లు, టీసీ, స్టడీ,కాండెక్ట్ సర్టిఫికేట్లను ఆదార్‌కార్డులతో ఉదయం 9గంటల కల్లా హాజరుకావాలని కోరారు.

పంటకాల్వలకు మరమ్మతులు

పిటలవానిపాలెం, జూలై 29 : ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు వ్యవసాయ తరుణం ప్రారంభం కావటంతో జలవనరుల శాఖాధికారుల చొరవతో పిట్టలవానిపాలెం జలవనరులశాఖా కార్యాలయం నుంచి పిట్టలవానిపాలెం, జీఎస్‌పాలెం, ఖాజీపాలెం గ్రామాల చెందిన పంటకాల్వలను సోమవారం రైతులు పొక్లెయిన్ సాయంతో కాల్వగట్లతోపాటు కాల్వలలోని గుర్రపుడెక్క, తూటికాడ తదితర వ్యర్థాలను తొలగించారు. గ్రామరైతులు వేగేశన కిషోర్‌రాజు ఆధ్వర్యంలో పంటకాల్వల మరమ్మతుల పనులను చేపట్టారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్‌ల పంపిణీ



బోనస్‌ను పంపిణీ చేస్తున్న డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్, మేనేజర్

రేపల్లె, జూలై 29: పాల ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ అండగా ఉంటూ వారు ఆర్థికంగా బలపడేందుకు దోహదపడుతుందని డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్ అన్నారు. సోమవారం పెనుమూడి, రావిఅనంతవరం సొసైటీల్లో బోనస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావిఅనంతవరం సొసైటీ పరిధిలో 90మందికి, పెనుమూడి సొసైటీలో 112 మంది పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశామన్నారు. రెండు సొసైటీలకు కలిపి రూ.11లక్షల 66వేలు, రాయితీల బోనస్‌లను అందించామన్నారు. పాడిరైతుల సంక్షేమ కోసం సంగం డెయిరీ ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రేపల్లె ఏరియా మేనేజర్ యలవర్తి గోపీకృష్ణ, కోఆర్డినేటర్ వి.నవీన్, సూపర్‌వైజర్ ఎ.వేణుగోపి, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

ప్యారిస్ ఒలింపిక్స్‌పై అవగాహన ర్యాలీ

బాపట్ల, జూలై 29 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వైస్ చైర్మన్ మేనేజింగ్ ఆదేశాల మేరకు ప్యారిస్ ఒలింపిక్స్‌పై జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. చెరువుజమ్ములపాలెం స్కూల్ నందు 700మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీ కృష్ణారావు అధ్యక్షత వహించగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కేపాల్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్యారిస్ ఒలింపిక్ గురించి వివరించారు. కార్యక్రమంలో పీడీ వీరచంద్ర, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

విశ్వంబరుడు సినారెకి నివాళి

● సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ

బాపట్ల, జూలై 29 : జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని, వందాలాది పాటలు రచించి విశ్వంబరుడుగా పేరుగాంచారని సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. సోమవారం డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి సభలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ప్రజాకవి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి 300 సినిమాల్లో 3,500 పైచిలుకు పాటలు రచించారని, ఆంధ్రరాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డులను పొందారని పేర్కొన్నారు. అనంతరం రచయితలు కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు మస్తాన్‌రెడ్డి, కీర్తివెంకయ్య తదితరులు డాక్టర్ సి.నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

రైతులకు సమృద్ధిగా సాగునీరు అందిస్తాం

● మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్



నిజాంపట్నం మండలం చెక్కావారిపాలెం ఎత్తిపోతల పథకం పునఃప్రారంభిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, జూలై 29: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం నిజాంపట్నం మండలం చెక్కావారిపాలెం ఎత్తిపోతల పథకం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మూతపడిన ఎత్తిపోతల పథకాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించి మరమ్మతులను నిర్వహించి మోటార్లు, పైప్‌లైన్లను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. తద్వారా చివరి భూముల వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీనికితోడు కృష్ణాడెల్టాకు పట్టిసీమ నీరు రావటం రైతులకు ఊరట కలిగించిందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగునీరుకు ఎలాంటి ఎద్దడి లేకుండా మంత్రి అనగాని ప్రత్యేక దృష్టిసారించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిరియాల ఏడుకొండలు, కొలసాని రాము, నల్లపాటి యల్లయ్య, బొర్రాసురేంద్ర, కేస న మధుసూదన్‌రావు, చెక్కావారిపాలెం, ప్రజ్ఞం టీడీపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో విచారించి సమస్యలు పరిష్కరించాలి

● ఎస్పీ తుషార్ డూడీ ● ప్రజాసమస్యల పరిష్కారవేదికకు 58అర్జీలు



దివ్యాంగుడి వద్దకెళ్లి అర్జీ తీసుకొని సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, జూలై 29 : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరిధిలో విచారించి పరిష్కరించాలని ఎస్పీ తుషార్ డూడీ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి వచ్చిన దివ్యాంగుడి వద్దకు స్వయంగా ఎస్పీ వెళ్లి అర్జీ తీసుకొని సమస్యను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మహిళల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి సంబంధిత స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 58 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. వీటిని త్వరగా పరిష్కరించాలన్నారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు వారి సమస్యలను విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సింగయ్య, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ లేదా స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలి

● రిక్షా కార్మికుల సమస్యలపై వినతిపత్రం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రిక్షా కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు

కొల్లూరు, జూలై 29 : తమకు జీవనాధారమైన రిక్షాలు పాడైపోయాయని తమను ఆదుకోవాలని కోరుతూ రిక్షా కార్మికుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సంఘ గౌరవ అధ్యక్షుడు బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ కొల్లూరు బస్టాండ్ సెంటర్లో 40 సంవత్సరాలుగా రిక్షాలు తొక్కుతూ వచ్చే చిన్నపాటి ఆదాయంతో వారు జీవనం సాగిస్తున్నారన్నారు. ఆటోలు, ఇతర వాహనాల ఎక్కువ కావడంతో తమ జీవనాధారం పూర్తిగా ఆ ప్రభావం పడిందన్నారు. ఇప్పుడు దానికి తోడు మాకు ఉన్న రిక్షాలు కూడా శిథిలావస్థకు చేరి బాగు చేయించుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు కార్పొరేషన్ ద్వారా గాని స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి మాకు జీవనాధారమైన రిక్షాల బాగు చేయించుకునేందుకు రూ.5 వేలు ఇప్పించాలని, 10 రిక్షాలు కొత్తవి ఇప్పించాలని వినతిపత్రం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి నాగేశ్వరరావు, దుర్గారావు, మరియదాసు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారవేదికకు ఐదు అర్జీలు

● ఆర్డీవో హేలా షారోన్



ఆర్డీవోకి వినతిపత్రాన్ని అందిస్తున్న ప్రజలు

రేపల్లె, జూలై 29: ప్రభుత్వం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదికను ప్రజలు సద్వినియోగించుకోవాలని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. ఐదు అర్జీలు వచ్చాయని తెలిపారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కారమయ్యేలా చూస్తానని ఫిర్యాదుదారులకు ఆమె హామీనిచ్చారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థికి కలెక్టర్ ప్రశంసపత్రం



విద్యార్థికి ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 29 : 10వ తరగతి పరీక్షల్లో జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి కలెక్టర్ జె.వెంకటమురళి సోమవారం ప్రశంసపత్రం అందజేశారు. సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ సంక్షేమవసతి గృహంలో విద్యనభ్యసిస్తూ 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి చేబ్రోలు అరవింద్‌ను అభినందించి ప్రశంసపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జేసీ బి.సుబ్బారావు తదితరులున్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



విద్యార్థినికి నగదు అందజేస్తున్న హెచ్ఎం జయకుమార్, దాత మురళీధరరావు

బాపట్ల, జూలై 29 : మండలంలోని వెదుళ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతిలో మొదటి 10ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సోమవారం నగదు బహుమతులు అందజేశారు. దాత ఏటగిరి మురళీధరరావు 90వేల రూపాయల నగదు బహుమతులను వారికి అందజేసి అభినందించారు. మొదటి స్థానంలో నిలిచిన షేక్ నీలోఫర్ రూ.12,500లు, రెండో స్థానంలో నిలిచిన కోట గౌరి ప్రసన్నకు రూ.12,500, మూడో స్థానంలో నిలిచిన దమ్ము స్వప్నకు రూ.10వేలు, నాలు గో స్థానంలో నిలిచిన తన్నీరు యోగితకు రూ.10వేలు, మిగిలిన ఆరుగురికి రూ. 7,500 చొప్పున మొత్తం రూ.90వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.జయకుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈ అక్రమాలపై విజిలెన్స్ విచారణ



వినియోగదారులతో విచారణ చేస్తున్న అధికారులు

మార్టూరు, జూలై 29 : మండలంలో విద్యుత్ వినియోగం అవసరం ఉన్న రైతులు, వ్యక్తుల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై ఏఈ ఎస్.శ్రీనివాసరావుపై సోమవారం మార్టూరులో విజిలెన్స్ విచారణ అధికారి డీఈ సంజీవరావు విచారణ చేశారు. కొణిదెన రోడ్‌లో ఉన్న విద్యుత్ డీఈ కార్యాలయంలో ఏఈ బాధితులతో ఆయన విచారణ చేపట్టారు. వారి దగ్గర నుంచి లిఖిత పూర్వకంగా విచారణలు స్వీకరించారు. విద్యుత్ ఏఈపై పలువురు వ్యక్తులు, రైతులు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో అధికారుల ఆదేశాలు మేరకు ఏఈపై విజిలెన్సు అధికారులు విచారణ చేపట్టారు.దాంతో పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు డీఈ కార్యాలయానికి వచ్చి ఏఈ పై ఫిర్యాదు చేయడం జరిగింది. అంతేగాకుండా అక్రమంగా ఏఈ డబ్బులు వసూలు చేసిన వైనాన్ని కూడా వారు విజిలెన్స్ అధికారికి తెలియచేశారు. రైతుల ట్రాన్స్‌ఫారం ఏర్పాటు, కొత్తగా ఏర్పాటు చేసే విద్యుత్ స్తంభాల విషయంలో కూడా ఏఈ అక్రమాలకు పాల్పడ్డారని వారు అధికారులకు తెలిపారు. మండలంలోని నాగరాజుపల్లి, కోలలపూడి, రాజుపాలెం, ద్రోణాదుల, మార్టూరు తదితర గ్రామాల నుంచి బాధితులు విజిలెన్సు అధికారిని కలిశారు. ఈ విచారణలోని అంశాలను ఉన్నత అధికారులకు నివేదికను పంపిస్తానని సంజీవరావు విలేకరులకు తెలిపారు. ఈ విచారణలో డీఈ సురేంద్రబాబు, జేఈ హనుమంతరావు పాల్గొన్నారు.

కుమారుడి ఆచూకీ లేదంటూ ఫిర్యాదు

మార్టూరు, జూలై 29 : నెలరోజుల కిందట కాలేజీకి వెళ్లిన కుమారుడు ఆచూకీ తెలియలేదని గన్నవరపు చెన్న కేశవులు అనే వ్యక్తి సోమవారం మార్టూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ వివరాలను ఏఎస్‌ఐ మహమ్మద్ బాషా తెలిపారు. తాటివారిపాలెం గ్రామానికి చెందిన చెన్నకేశవులు కుమారుడు శివశంకర్ వైజాగ్‌లోని రఘు ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అతను నెలరోజుల కిందట ఇంటికి వచ్చి వెళ్లాడు. అయితే వైజాగ్ వెళ్లిన తర్వాత తరచూ కుమారునికి ఫోన్ చేయడానికి చెన్నకేశవులు ప్రయత్నించగా కుమారుడు క్లాస్‌లో ఉన్నానని, బిజీగా ఉన్నానని సమాధానం మెసేజ్ రూపంలో సమాధానం వస్తున్నట్లు చెప్పారు. అడపాదడపా ఫోన్‌కు డబ్బులు పంపిస్తున్నానని, వారం రోజుల నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందన్నారు. వైజాగ్‌లో ఉన్న బంధువులకు ఈ విషయాన్ని చెప్పడంతో వారు కాలేజీకి వెళ్లి విచారించగా నెల రోజుల నుంచి శివశంకర్ కాలేజీకి రావడం లేదని సిబ్బంది చెప్పినట్లు చెప్పారు. దీనిపై ఆందోళన చెందిన చెన్నకేశవులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

మంత్రి స్వామికి వైద్య పరీక్షలు

విశ్రాంతి తీసుకోవాలని సూచించిన వైద్యులు



మంత్రికి స్కానింగ్ తీస్తున్న సిబ్బంది

ఒంగోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామికి సోమవారం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం పాలేటిపాడులో ఆదివారం తిరునాళ్ల సందర్భంగా ఎండ్లబండి వద్ద అభిమానులు మంత్రితో ఫొటోలు దిగారు. ఆ సమయంలో డీజే సౌండ్లకు ఎద్దు బెదరడంతో మంత్రి స్వామి కిందపడి పోగా ఎద్దు కాలుతో తొక్కింది. సెక్యూరిటీ అప్రమత్తంతో స్వామికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఆ ఘటనలో వీపుపై ఎద్దు తొక్కడంతో అక్కడ వత్తిడి పడింది. సోమవారం ఉదయానికి తీవ్రంగా నొప్పులు వచ్చాయి. దీంతో నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో డాక్టర్ స్వామికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రమాదం ఏమీ లేదని తేల్చిన వైద్యులు నాలుగైదు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే మంగళవారం సాంఘిక సంక్షేమం, సచివాలయాల శాఖలపై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష చేయనున్నారు. ఈ నేపథ్యంలో వైద్య పరీక్షలు అనంతరం మంత్రి స్వామి అమరావతికి బయలుదేరి వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ముండ్లమూరు, జూలై 29 : ముండ్లమూరు గ్రామానికి చెందిన ఎస్‌కే ఖాజావలి(60) రోడ్డు ప్రమాదంలో గాయ పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ముండ్లమూరుకు చెందిన ఖాజావలి ద్విచక్రవాహనంపై ఆదివారం అద్దంకి వెళ్తుండగా పోలవరం సమీపంలోకి వెళ్లే సరికి దర్శి వైపు వెళ్తున్న పాల ట్యాంకర్ ఢీకొంది. తీవ్ర గాయాలైన ఖాజావలిని కుటుంబ సభ్యులు గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఎస్ఐ వీ నాగమల్లేశ్వరరావు సందర్శించి కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సబ్సిడీ దుర్వినియోగం ఆరోపణపై ఏవో సస్పెన్షన్

పర్చూరు, జూలై 29 : సబ్సిడీ శనగల నగదు దుర్వినియోగానికి సంబంధించి పర్చూరు వ్యవసాయాధికారి ఎస్.రామ్మోహన్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. 2022-23 సంవత్సరానికి సంబంధించి జాతీయ ఆహార భద్రతా పథకం (ఎన్ఎఫ్ఎస్ఎం) కింద రైతులకు రాయితీపై శనగ విత్తనాలను పంపిణీ చేశారు. అయితే రూ.7.32లక్షల సబ్సిడీ నగదును సీడ్స్‌కు చెల్లించాల్సి ఉంది. రైతుల వద్ద సేకరించిన నగదును ఏవో చెల్లించకపోవడంపై ఏపీ సీడ్స్ అధికారులు జేడీఏకు ఫిర్యాదు చేశారు. దీనిపై వివరణ కోరుతూ ఏవోకు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. దీనిపై వీఏఏలు విచారించారు. ఈనేపథ్యంలో నగదును తన సొంత ఖర్చులకు వినియోగించుకున్నట్లు ఏవో తెలిపారు. ఏపీ సీడ్స్ ఫిర్యాదుతో కమిషన్ కార్యాలయం నుంచి జేడీఏకు చర్యలకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో జేడీఏ ఆదేశాల మేరకు ఏవోను సస్పెండ్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి ఏడీఏకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

నిజాయితీ చాటుకున్న రైతు



డబ్బులు అందజేస్తున్న బాలయ్య

కురిచేడు, జూలై 29 : కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామానికి చెందిన వరికూటి బాలయ్య ఫోన్‌పే నంబరుకు రాజమండ్రికి చెందిన వీరవల్లి జగదీశ్వర ప్రసాద్ పొరబాటున రూ.30,000 పంపించారు. ఆ తరువాత బాలయ్యకు ఫోన్ చేసి పొరబాటు జరిగిందని, తన డబ్బులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బాలయ్య ఈ విషయం కురిచేడు పోలీస్ స్టేషన్‌లో తెలిపారు. జగదీశ్వర ప్రసాద్‌ను కురిచేడు పోలీస్‌స్టేషన్‌కు సోమవారం పిలిపించారు. ఆ మొత్తాన్ని పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు జగదీశ్వరప్రసాద్‌కు అప్పగించారు. తన ఖాతాకు వచ్చిన మొత్తాన్ని నిజాయితీతో అప్పగించిన బాలయ్యను పోలీసులు అభినందించగా రాజమండ్రికి చెందిన జగదీశ్వర ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

కృష్ణమ్మ పరవళ్లతో భరోసా

జిల్లాలోని అన్నదాతల్లో ఆశలు

బేసిన్‌లోని ప్రాజెక్టులకు భారీగా వరద

ఇప్పటికే నిండిన కర్ణాటక రిజర్వాయర్లు

శ్రీశైలానికి 4.70 లక్షల క్యూసెక్కులు రాక

మూడు గేట్లు ఎత్తిన డ్యాం అధికారులు

సాగర్ వైపు పరుగెడుతున్న జలాలు


ఈ సీజన్ సాగు, తాగునీటికి ఢోకా లేనట్లే!

అన్నదాతలలో ఆశలు చిగురించాయి. ఈ సీజన్ సాగు, తాగునీటికి భరోసా లభించింది. ఏడాది నుంచి తీవ్ర ఇబ్బందులు పడ్డ సాగర్ ఆయకట్టు రైతులకైతే ఖచ్చితంగా మంచి కబురే. కృష్ణా నదిలో వరద పోటెత్తుతోంది. ప్రాజెక్టులు జలాలతో కళకళలాడుతున్నాయి. ఎగువ ప్రాంతంలో కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న భారీవర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నదికి ఎగువ ప్రాంతంలోని కర్ణాటక, తెలంగాణల్లో ఉన్న ప్రాజెక్టులు ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ఇప్పటికే నిండటంతో శ్రీశైలానికి భారీగా వరదనీరు వస్తోంది. డ్యాం మూడు గేట్లు ఎత్తడంతో అక్కడి నుంచి కూడా దిగువకు ఉన్న అత్యంత కీలకమైన నాగార్జునసాగర్ డ్యామ్ వైపు ప్రస్తుతం వరద పరుగుపెడుతోంది.

ఒంగోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లావాసులకు ఈ ఏడాది నీటికష్టాలు తప్పాయి. ఎట్టకేలకు కృష్ణా నదికి పైనుంచి వరద నీరు వస్తోంది. కృష్ణా బేసిన్‌లో వారం, పదిరోజులు క్రితం మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీవర్షాలు కురిశాయి. అప్పటికే ఆ ప్రాంతంలో కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులలో భారీగానే నీరు ఉండటంతో వస్తున్న వరద నీటిని ఒక్కొక్క ప్రాజెక్టు నుంచి దిగువకు వదులుతున్నారు. అలా రాష్ట్రంలోని శ్రీశైలం ప్రాజెక్టుకు ఈనెల 17న స్వల్పంగా నీరు రావడం ప్రారంభం కాగా నాలుగైదు రోజులుగా వరద పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 885 అడుగులు కాగా నీటి సామర్థ్యం 215 టీఎంసీలు. కాగా వరద నీరు రాకతో గత ఐదు రోజుల్లో దాదాపు 123 టీఎంసీల మేర ప్రాజెక్టులోకి చేరింది. ఇక సోమవారం నాటికి వరద నీటి ప్రవాహం మరింతగా పెరిగింది.

మూడు గేట్లు ఎత్తి..

సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రాజెక్టులోకి దాదాపు 4.17 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా ఆ సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 879.90 అడుగులకు చేరింది. దాదాపు 180 టీఎంసీలకు నీరు నిల్వ చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. భారీగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం ప్రాజెక్టు మూడు గేట్లను అధికారులు ఎత్తి సుమారు 81వేల క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. ఎగువ నుంచి నీరు రాక పెరిగే కొద్ది మరి కొన్ని గేట్లను మంగళవారం ఎత్తే అవకాశం ఉంది. శ్రీశైలం గేట్లు ఎత్తి 81వేల క్యూసెక్కులను నీరు వదలగా అప్పటికే కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల ద్వారా మరో 80వేల క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. అలా ప్రస్తుతం శ్రీశైలం నుంచి సోమవారం సాయంత్రం ఇంచుమించు 1.61లక్షల క్యూసెక్కుల నీరు సాగర్ డ్యామ్ వైపు పరుగులు తీస్తున్నది. ఆ నీరు రెండు రోజుల్లో సాగర్ డ్యామ్‌లోకి చేరే అవకాశం ఉంది.



శ్రీశైలం డ్యాం వద్ద విడుదలైన నీటి హొయలు

ఈ సీజన్‌కు భరోసా

వస్తున్న వరదను పరిశీలిస్తే రానున్న వారంరోజుల్లో సాగర్‌కు భారీగా వరదనీరు వచ్చి చేరి డ్యామ్ నిండే పరిస్థితి కనిపిస్తోంది. దాని వల్ల జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు సాగునీరు, ప్రజలకు తాగునీరు ఈ సీజన్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందే అవకాశం ఉంది. గత ఏడాది కృష్ణా బేసిన్‌లో వర్షాలు లేక ప్రాజెక్టుల్లోకి నీరు రాక డ్యామ్‌ల నుంచి నీటి విడుదల జరగలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో సాగర్ ఆయకట్టులోని 4.42 లక్షల ఎకరాలకు సాగునీరు అందక రైతులు నష్టపోయారు. అంతేకాక తాగునీటికి సైతం నీరు సరిపడా రాక ప్రజానీకం అవస్థలు పడ్డారు ప్రస్తుతం కూడా జిల్లాలో తాగునీటి అవసరాలకు సాగర్ నీరు అరకొరగానే వస్తోంది. అయితే ప్రస్తుతం కృష్ణమ్మ పరవళ్ల జిల్లాలోని ప్రజలకు తాగునీరు, ఆయకట్టుకు ఈ సీజన్ సాగునీరుపై పూర్తిభరోసా కనిపిస్తోంది.

బుధవారం ఉదయానికి సాగర్‌కు..

ఇక సాగర్ డ్యామ్ పరిస్థితిని పరిశీలిస్తే 590 అడుగుల నీటిమట్టం కాగా 312 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న సాగర్ డ్యామ్‌లో ప్రస్తుతం నీటిమట్టం 512 అడుగులు ఉండగా సుమారు 136 టీఎంసీలు నీరు ఉంది. అలాగే 55 వేల క్యూసెక్కుల నీరు ప్రస్తుతం డ్యామ్‌లోకి వస్తోంది. శ్రీశైలం నుంచి సోమవారం సాయంత్రం వరద నీరు బుధవారం ఉదయానికి డ్యామ్‌కు చేరే అవకాశం ఉండగా అప్పటి నుంచి సాగర్ డ్యామ్ నీటి నిల్వ క్రమంగా పెరుగుతుంది.ప్రస్తుతం కృష్ణా ఎగువ ప్రాంతంలోని కర్ణాటక, తెలంగాణ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, వాటిలోకి వస్తున్న వరద, అక్కడి నుంచి దిగువకు నీటి విడుదల పరిశీలిస్తే శ్రీశైలం ప్రాజెక్టు మంగళవారానికే నిండనుంది. ఆ తర్వాత మరింత భారీగా సాగర్ డ్యామ్‌కు శ్రీశైలం నుంచి వరదనీరు అధికారులు వదులుతారు.


వసూల్ రాజాలకు బ్రేక్..!

జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్లలో ఐడీ పార్టీలను రద్దు చేస్తూ ఎస్పీ దామోదర్ ఉత్తర్వులు

పోలీసు శాఖలో ఆ విభాగానికి డిమాండ్

చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో పంచాయితీ

ఆ పోస్టుల్లో చేర్చుకోవాలని సిఫార్సులు



ఒంగోలు(క్రైం),జూలై 29: పోలీసు శాఖలో యూనిఫామ్ వేయకుండా చేసే విధులకు డిమాండ్ ఎక్కువ. అందులో ఐడీ పార్టీ అంటే భలే మోజు. పోలీసు స్టేషన్లలో ఎలాంటి బాధ్యతలు ఉండవు, బందోబస్తులకు అస్సలు వెళ్లరు. స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఎస్సై, సీఐ ఎవరున్నా సరే వారి వెంట నిత్యం కారులో తిరుగుతూ ఉండవచ్చు. అదేసమయంలో ఎస్సైలు సీఐలు యూనిఫామ్‌లో ఉన్నప్పటికీ ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు మాత్రం మఫ్టీలో ప్రత్యక్షమవుతారు. అంతేకాదు స్టేషన్ మొత్తం తమేదే అన్నట్లు ప్రవర్తిస్తారు. అక్కడ పెత్తనం చెలాయిస్తుంటారు. మాట వినని సిబ్బందిపై ఎస్సైలకు చెప్పి పనిష్మెంట్ కూడా ఇప్పిస్తుంటారు. మరోకోణం ఏమిటంటే వసూల్ రాజాలు కూడా వారే. స్టేషన్లకు నెల మామూళ్ల నుంచి ఇతర కేసులలో వచ్చే మొత్తాలు కూడా వారి ద్వారానే అధికారులకు చేరుతుందని సమాచారం. ఇలాంటి పనులు చేసేందుకు కొంతమంది పోటీలు పడుతుంటారు. వారి పని కేవలం వసూలు చేయడం అవసరమైన చోట ఖర్చు పెట్టడంతోపాటు మిగిలిన లెక్క అధికారికి అప్పగించడమే. అంతా అమ్యామ్యా వ్యవహారం నేపథ్యంలో వారు ఇచ్చిందే లెక్క కావడంతో కాస్తోకూస్తో వెనుకేసుకునే అవకాశం ఉంటుంది. అందుకోసం ఐడీ పార్టీలోకి వెళ్లేందుకు పెద్దపెద్ద వారి సిఫార్సులు చేయించుకుంటారు. ఇందుకు చీమకుర్తి ఘటన నిదర్శనం. ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ పురిలో ఉన్న పోలీసు స్టేషన్‌లో ఇలాంటి వసూల్ రాజా పోస్టుకు ఓ కానిస్టేబుల్ ఏకంగా పొరుగు జిల్లాకు చెందిన రాష్ట్రంలో కీలకంగా ఉన్న ప్రజాప్రతినిధి ద్వారా సిఫార్సు చేయించుకోవడం చర్చకు దారితీసింది. దీంతో పోలీసు స్టేషన్‌లో పంచాయితీ జరిగింది. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసి జిల్లాలో ఉన్న ఐడీ పార్టీ సిబ్బంది రోజు వారి విధులకు హాజరు కావాలని ఆదేశాలు జారీచేశారు.



ఎస్పీ దామోదర్

ఐడీ పార్టీలు అంటే..

గతంలో పోలీసు స్టేషన్లలో ఐడీ పార్టీలు అంటే అత్యంత గోప్యమైన సమచారాన్ని తెలుసుకుని ఎప్పటికప్పుడు అధికారులకు చేరవేస్తుంటారు. ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీలు, నేరస్థులు, అసాంఘిక శక్తుల వివరాలు వారు చేసే కుట్రలు ముందుగా పసిగట్టి శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా వాటిని భగ్నం చేస్తుంటారు. ప్రజలతో మమేకమై క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు, అంతర్గత కలహాల గురించి సమాచారం సేకరిస్తారు. అధికారులను అప్రమత్తం చేస్తారు. అయితే అందుకు విరుద్ధంగా ప్రస్తుతం ఐడీ పార్టీలు వసూల్ రాజాలుగా మారారు. బయట సమాచార సేకరణ వదిలేసి నేరుగా ఎస్సై, సీఐలతో వ్యవహారాలు మాత్రమే చేస్తున్నారు. తమకు ఇబ్బంది లేకుండా ఉండటంతో అధికారులు కూడా ఐడీ పార్టీలను ప్రోత్సహిస్తూ లాభపడుతున్నారు.

చీమకుర్తిలో ఇదీ పంచాయితీ

చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో ఐడీ పార్టీ విషయంలో పంచాయితీ జరిగింది. ఆర్మ్డ్ రిజర్వుడు నుంచి కన్వర్షన్‌తో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వ్యక్తి ఐడీ పార్టీ కానిస్టేబుల్ కోసం పోటీ పడ్డారు. పొరుగు జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధి సిఫారుసు మేరకు విధులు నిర్వహించేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయం బయటకు పొక్కింది. దీంతో స్థానిక రాజకీయ నాయకులు జోక్యం చేసుకున్నారు. ఇలాంటి సిఫార్సులు వస్తుంటే తామెందుకు ఇక్కడ అంటు స్టేషన్‌లో పంచాయితీ జరిగింది. అయినా వసూళ్ల కోసం కానిస్టేబుల్ ఏమిటి అంటూ స్థానిక నాయకులు ప్రశ్నించారు. ఈ వ్యవహారం మొత్తం పోలీసు బాస్‌కు చేరింది. దీంతో ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఐడీ పార్టీలు రద్దు : ఎస్పీ

జిల్లాలో పోలీసు స్టేషన్లలో ఐడీ పార్టీలు రద్దుచేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలు జారీచేశారు. చీమకుర్తి స్టేషన్‌లో జరిగిన పంచాయితీ పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగే విధంగా ఉంది. ఈ మేరకు సోమవారం ఎస్పీ, పోలీసు అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఐడీ పార్టీలలో ఉన్న వారు అంతా రోజు వారి విధులకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. దీంతో ఈ విషయం జిల్లా పోలీసు శాఖలో చర్చనీయంశంగా మారింది.

వైసీపీ నేత విల్లాల్లో అవినీతి బీటలు..!

మాజీ మంత్రి బాలినేని వియ్యంకుడు ఫ్లాట్లలో తనిఖీలు

నిర్మాణ విషయంలో వచ్చిన ఆరోపణలపై కదిలిన యంత్రాంగం

రెవెన్యూ మైనింగ్, ఎస్ఈబీ నేతృత్వంలో రికార్డులు పరిశీలన

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 29 : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు కుండా భాస్కర్‌రెడ్డి విల్లాలు వివాదాల్లో చిక్కుకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఒంగోలు సమీపంలో నిర్మాణాలు చేపట్టిన శ్రీకరి ఎంపైర్ కట్టడాలపై గత రెండు సంవత్సరాలుగా అనేక ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ నిధులతో యరజర్ల కొండను తవ్వి ఆ మట్టిని అనుమతుల్లేకుండా అడ్డగోలుగా విల్లాలకు తరలించారనే ఫిర్యాదులతోపాటు, ఇసుక అక్రమ వినియోగం, అలాగే సమీప గ్రామానికి చెందిన రైతుల భూములను బలవంతంగా రాయించుకున్నారనే ఆరోపణలు ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారాన్ని రేపాయి. ఇదిలా ఉండగా బాలినేని వియ్యకుండి విల్లాల్లో అంతా అడ్డగోలు వ్యవహారమే నడిచిందంటూ టీడీపీ నేతలు కూడా ధ్వజమెత్తారు. మరోవైపు ఆర్యవైశ్య నాయకుడు సుబ్బారావుగుప్తా ఇటీవల విల్లాల సమీపంలో అవినీతిపై అక్రమాలు తేల్చాలని నిరసనకు దిగిన విషయం తెలిసిందే.

ఎట్టకేలకు అధికారుల దాడులు

కాగా గడిచిన రెండు నెలల క్రితం వరకు వైసీపీ అధికారంలో ఉండగా, విల్లాల వైపు కన్నెత్తి చూడని యంత్రాంగం సోమవారం సాయంత్రం ఎట్టకేలకు కదలింది. నిర్మాణంలో ఉన్న విల్లాల్లో మైనింగ్, రెవెన్యూ, ఎస్ఈబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సుమారు రెండు గంటలపాటు రికార్డులు పరిశీలనతోపాటు, నిర్మాణం కోసం ఉపయోగించిన ఇసుక, మట్టి, ఇతర మెటీరియల్‌తోపాటు, ఇసుక డంప్‌లు, ప్రారంభం నుంచి ఇప్పటివరకు జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించినట్లు సమాచారం. అయితే బృందంలో ఉన్న అధికారులను తనిఖీలకు సంబంధించిన అంశాలపై వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు తాము భౌతిక పరిశీలనకు విచ్చేసినట్లు మాత్రమే వెల్లడించారు. మొత్తంగా మూడేళ్లుగా శ్రీకర అంపైర్ విల్లాలు నిర్మాణాలకు సంబంధించి భారీగానే విమర్శలు, ఆరోపణలు, అవినీతి కట్టడాలంటూ ఫిర్యాదులు అందాయి. కాగా సోమవారం అధికారులు చేసిన తనీఖీలపై అటు రాజకీయవర్గాల్లోనూ, ఇటు వైసీపీ శ్రేణుల్లోనూ కలవరం మొదలైంది.

తప్పు ఎవరిది..నిజం నిగ్గు తేల్చాలి..!

కాలం తీరిన మందులున్నాయని డాక్టర్ బాలరాజు ఫార్మసిస్టుపై ఆరోపణ

డాక్టర్ ఉద్దేశపూర్వకంగా వేరే ఔషధాలను చూపించారంటూ ప్రత్యారోపణ

వైద్యుడిపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వెళ్లిన ఫార్మసిస్టు, మరికొందరు

డీఎంహెచ్‌వో ఆదేశాలతో మాత్రలను పరిశీలించిన ఇద్దరు అధికారులు



మందులను పరిశీలిస్తున్న సభ్యులు

వేటపాలెం (చీరాల), జూలై 29 : వేటపాలెం పీహెచ్‌సీలో వైద్యుడు బాలరాజు, ఫార్మసిస్టు మధ్య నెలకొన్న వివాదం తార స్థాయికి చేరింది. ఈ క్రమంలో సోమవారం తాను ఫార్మసిస్టు రూములో మందులను పరిశీలించగా కాలం చెల్లిన మందులు ఉన్నాయని, గతంలో కూడా పలుమార్లు తాను గమనించానని డాక్టర్ బాలరాజు విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు. తాను సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సమయంలో డాక్టర్ బాలరాజు తన తండ్రితో కలసి నా రూంలో నా దగ్గరలేని మందులు కొన్ని పెట్టి, కొందరితో కలసి వెళ్లి ఉద్దేశ పూర్వకంగా తనపై నిందలు వేస్తూ ఒక సిరప్‌ను చూపించి తనపై నిందలు వేస్తున్నారని ఫార్మసిస్టు వెంకటప్రసాద్ ఓ వీడియో విడుదల చేశారు. ఇదిలావుండగా డాక్టర్, సిబ్బంది ఆరోపణ, ప్రత్యారోపణల నేపథ్యంలో తప్పు ఎవరిదో నిగ్గు తేల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రిలో ఇంత జరుగుతుంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని పజలు ప్రశ్నిస్తున్నారు. కాలం చెల్లిన మందులు ఇచ్చి ఏదన్నా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మండి పడుతున్నారు. ఈ క్రమంలో డీఎంహెచ్‌వో విజయమ్మ ఆదేశాల మేరకు డాక్టర్ భూషణరావు, ఫార్మసిస్టు సూపర్‌వైజర్ ఇద్దరూ సోమవారం సాయంత్రం వేటపాలెం పీహెచ్‌సీలోని ఫార్మసిస్టు గదిలో ఉన్న మందులను పరిశీలించారు. వాటికి సంబంధించిన నివేదికను డీఎంహెచ్‌వోకు నివేదిస్తామని తెలిపారు.

నేడు సమస్యను పూర్తిగా పరిష్కరిస్తాం

- డీఎంహెచ్‌వో విజయమ్మ

కాలం చెల్లిన మందులను ఎవరు కూడా పేషెంట్లకు ఇవ్వరు. అయితే అక్కడ వైద్యుడు, ఇతర సిబ్బంది మధ్య వివాదం దీర్ఘకాలంగా నెలకొన్న విషయం బహిరంగ రహస్యమే. ఏదేమైనా సమస్యను మంగళవారం పరిష్కరిస్తాం. మందుల తనిఖీకి వెళ్లిన ఇద్దరు అధికారులకు వివరాలు తెలిపేందుకు ఇతర వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. వారంతా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చారు. అన్ని కోణాల్లో విచారించి, వాస్తవాలను పరిగణలోకి తీసుకుని సమస్యను పరిష్కరిస్తాం.

లిక్కర్ పరవళ్లు

- ఆగని సారా, గంజాయి వినియోగం
- జగన్ బ్రాండ్లను ఆపాలని మద్యం ప్రియుల డిమాండ్
- రెస్టారెంట్, బార్‌లలో అధిక ధరలకు విక్రయాలు
- పట్టించుకోని అధికారులు

చీరాల, జూలై 29 : ఎన్‌డీపీ (నాన్ డ్యూటీ పెయిడ్) లిక్కర్ చీరాల నియోజకవర్గంలో, ప్రధానంగా తీరప్రాంతంలో పరవళ్లు తొక్కుతోంది. నాటుసారా, గంజాయి వినియోగం కొనసాగుతూనే ఉన్నాయి. రెస్టారెంట్ అండ్ బార్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యంను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. లూజ్ సేల్స్‌లో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వీటిపై చర్యలు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఒక వైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోం మినిస్టర్ వంగలపూడి అనితలు నార్కోటిక్స్ వినియోగంతో వైసీపీ పాలనలో నెలకొన్న పరిణామాలపై పూర్తి స్థాయిలో ఉక్కుపాదం మోసేందుకు కసరత్తు చేస్తున్నారు. నిర్దిష్టంగా సంబంధిత అధికారులకు కూడా ఆదేశాలకు జారీ చేసిన విషయం తెలిసిందే. క్షేత్ర స్థాయిలో మార్పు రాకుండా సత్ఫలితాలు రావని పలువురు అంటున్నారు.

ఆగని ఎన్‌డీపీ లిక్కర్ దిగుమతి

ఎన్‌డీపీ లిక్కర్ దిగుమతి జరుగుతూనే ఉంది. గతంలో గోవా, కర్నాటక, తెలంగాణ నుంచి దిగుమతయ్యే ఎన్‌డీపీ లిక్కర్‌పై పోలీస్ ఉన్నతాధికారులకు అందిన సమాచారంతో పోలీస్, ఎస్ఈబీ, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడులలో భారీగా పొరుగు మద్యం ఒకటికి పలుమార్లు పట్టుబడింది. అయితే ఆ తరువాత అధికారుల మధ్య సమన్వయం లోపించింది. అందుకు పలు రకాల కారణాలనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ క్రమంలో ఎన్‌డీపీ దిగుమతులపై పెద్దగా దృష్టి కేంద్రీకరించటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జగన్ బ్రాండ్లు ఆపండి

వైసీపీ హయాంలో జగన్ బ్రాండ్లుగా పేరుపడ్డ నాసికరం మద్యంను వెంటనే ఆపాలని మద్యపాన ప్రియులు ముక్తకంఠంతో కోరుతున్నారు. కూటమి ప్రభుత్వ గెలుపులో తమ భాగస్వామ్యం కూడా గణనీయంగా ఉందని, అయితే ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా జగన్ బ్రాండ్లను తాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర ఎక్కువ, నాణ్యత సున్నా, దీంతో తాము నాటుసారా వినియోగానికి మరలామని కొందరు చెప్తున్నారు. వెంటనే నాణ్యమైన మద్యం సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

సిండికేట్‌గా మారిన బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు

మద్యం అధిక ధరలకు విక్రయాలు

బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహకులు సిండికేట్‌గా మారారు. సాధారణంగా వైన్ షాపుల కన్నా నిబంధనల మేరకు మద్యంను అధిక ధరలకు విక్రయించుకునే వెసులుబాటు ఉంది. అయితే సిండికేట్‌గా మారి నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టారీతిన అదనపు ధరలు వసూలు చేస్తున్నారు. దీంతో తమకు తీరని అన్యాయం జరుగుతోందని మద్యం సేవించేవారు వాపోతున్నారు.



పట్టుబడ్డ అక్రమ మద్యం, నిందితుడితో అధికారులు (ఫైల్)

గంజాయి వినియోగంతో లోపిస్తున్న విచక్షణ..!

గతంలో గంజాయి అంటే ఎక్కడో ఒకరు, అర సాధువులు లాంటి వారు సేవించేవారు. అది పరిమితుల్లో కన్పించేవారు. అయితే ప్రస్తుతం గంజాయి వినియోగం వైపు కొందరు యువకులు ఆకర్షితులవుతున్నారు. మొదట ఫ్యాషన్ అని తరువాత మానలేకపోతున్నామనే స్థితికి చేరుతున్నారు. విచక్షణ కోల్పోతున్నారు. ఇది ప్రమాదకర పరిణామం. దీన్ని నియంత్రించడం అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదు. విద్యా సంస్థలు, తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. తీరప్రాంతంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు గంజాయి సేవించి మోటారు సైకిల్ పందేలు పేరుతో ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఆ సమయంలో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు కూడా ప్రమాదంలోకి వెళ్లే పరిస్థితి. ఈ నేపథ్యంలో తగిన చర్యలతో ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.



ఇన్వర్టర్లను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

గురుకులాలకు ఇన్వర్టర్ల అందజేత

అద్దంకిటౌన్, జూలై 29 : ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనలో భాగంగా క్యూబ్ హైవేస్ ఆధ్వర్యంలో క్యూబ్ రూట్ ఫౌండేషన్‌కు చెందిన నామ్ రోడ్డు ప్రతినిధులు సోమవారం గురుకుల పాఠశాలలకు ఇన్వర్టర్లను అందజేశారు. అద్దంకిలోని హైవే పక్కనే ఉన్న డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలకు క్యూబ్ హైవేస్ వారు పాఠశాలకు అవసరమైన 300 ఏఎన్‌హెచ్‌ఎస్ ఇన్వర్టర్స్‌ను అందజేశారు. రాష్ట్రీయ రహదారికి అనుకున్న ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు క్యూబ్ రూట్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.దుర్గా గాయత్రి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఫౌండేషన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.

హెపటైటీస్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మోహనరావు

అద్దంకిటౌన్, జూలై 29 : హెపటైటీస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. సోమవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూవాలజీ, కామర్స్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ హెపటైటీస్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ కలుషిత నీరు, రక్తం ద్వారా కాలేయం దెబ్బతిని పసికర్లు, లివర్‌వాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. హెపటైటీస్ వ్యాధి వచ్చిన వారి నుంచి సంపర్కం ద్వారా కూడా ఇతరకులకు వ్యాపిస్తతందన్నారు. మత్తు, మద్యం ద్వారాను ఈ వ్యాధి ప్రబలుతుందన్నారు. విద్యార్థులు తమ పరిసరాలను, నీటిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ హనుమంతరాజు, బి. అశోక్‌కుమార్, ఏ. శిఖామణి, గంగాధర్, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతిబోరు బాగుచేయండి..!

- మునిసిపల్ అధికారులకు వినతి
- కొద్ది రోజులకే ఆనవాళ్లు మాయం
- నర్రావారిపాలెంలో సంఘటన

అద్దంకిటౌన్, జూలై 29 : ఎన్నో ఏళ్లగా చేతి బోరు నీళ్లతో కాలం గడుపుకుంటున్నాం. మూడు సంవత్సరాల నుంచి చేతి బోరు మరమ్మతులకు గురైంది. మరమ్మతులు చేసి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందించారు. అంతే కొన్ని రోజులు గడిచే సరికి ఆ చేతి బోరు ఆనవాళ్లు కూడా



నర్రావారిపాలెంలో గతంలో ఉన్న చేతి బోరు



మాయమైన బోరు

లేకుండా చేశారు. ఇది అద్దంకిలోని నర్రావారిపాలెం బట్టీ బడికి వెళ్లే దారిలో జరిగింది. కాలనీ వాసులు చేతి బోరు ద్వారా తమ నీటి అవసరాలు తీర్చుకునేవారు. అయితే ఆ చేతిబోరు మూడు సంవత్సరాలుగా మరమ్మతులకు గురైందని, దానిని బాగు చేయించి ఉపయోగంలోకి తేవాలని మహిళలు కొందరు మున్సిపల్ అధికారులు వినతిపత్రం అందించారు. చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ప్రస్తుతం ఆ చేతి బోరు ఆనావాళ్లు కూడా లేకుండా చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు చేతిబోరును కింద వరకు మిషన్‌తో కట్ చేయించి దినిపై రాయిని పెట్టారు. దీనిపై మహిళలు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో నీటి అవసరాలకు ఉపయోగపడే చేతిబోరును ఇలా చేయడం ఏమిటని, వెంటనే సంబంధిత మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని చేతిబోరును ఏర్పాటు చేయకుంటే ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

గీత కార్మికుడి పైకి దూసుకెళ్లిన ఆటో

చీరాలటౌన్, జూలై 29 : గీత కార్మికుడి పైకి ఆటో దుసూకెళ్లడంతో క్షతగాత్రుడికి పలు రక్త గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే వేటపాలెం మండలం అక్కాయిపాలెంకు చెందిన ఉప్పాల వెంకటేశ్వర్లు గీత కార్మికుడు. ఇతను కుటుంబ అవసరాల నిమిత్తం సోమవారం ఉదయం కూరగాయాలు తెచ్చేందుకు ద్విచక్ర వాహనంపై జాండ్రపేట వెళ్లారు. ఆ ప్రాంతంలోని శివాలయం సమీపంలో గుర్తుతెలియని ఆటో వేగంగా పైకి దూసుకు వచ్చింది. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడగా, పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. 108లో చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.



చికిత్స పొందుతున్న కార్మికుడు

ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలి

కలెక్టర్ వెంకటమురళి

చీరాల, జూలై 29 : ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అధికారులు పూర్తిస్థాయిలో అరికట్టాలని కలెక్టర్ జే వెంకటమురళి హెచ్చరించారు. ఆగని ఇసుక అక్రమ రవాణా అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం ప్రచురితమైంది. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకట మురళి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుకను ఇష్టానుసారంగా తవ్వకుని వెళ్తుంటే అధికారులు తమకేమీ పట్టనట్లు చూస్తూ ఊరుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలన్నారు. దళారీల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమిస్తామన్నారు. నియమించిన కమిటీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తదుపరి ఇచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకట మురళి స్పష్టం చేశారు.

పాసుపుస్తకాలపై రాజముద్ర

మంత్రి గొట్టిపాటి హర్షం



అద్దంకి, జూలై 29 : రాజముద్రతో భూయజమానులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవడంపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి పట్టాదారు పాసుపుస్తకంపై రాజముద్ర వేసి ఇస్తామని చెప్పిన మాటకు కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్‌రెడ్డి పట్టాదారు పాసుప్తకాలపై తన బొమ్మను ముద్రించుకున్నారు. ఇది జగన్‌రెడ్డి ప్రచార పిచ్చికి పరాకాష్ట అన్నారు. దీనికి రూ.15కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు. పొ లాల సరిహద్దు రాళ్లపై తన బొమ్మను ముద్రించి జగన్‌రెడ్డి రూ.700కోట్లు ప్రజాధనం వృథా చేశారన్నారు. ఈ నిధులు సరిగ్గా వినియోగించుకొని ఉంటే రాష్ట్రంలో ఏదో ఒక ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వచ్చి ఉండేదన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఏర్పాటు అయిన ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, గతంలో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను పోల్చి చూస్తే ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య ఉన్న తేడా స్పష్టంగా కనిపిస్తుంని రవికుమార్ అన్నారు.

సోలార్ పంప్‌సెట్ ప్యానల్స్ చోరీ



నాగులపాడులో చోరీకి గురైన సోలార్ పంప్‌సెట్ ప్యానల్స్

అద్దంకి, జూలై 29 : మండలంలోని నాగులపాడు పొలాల్లో వ్యసాయ సోలార్ పంప్‌సెట్ ప్యానల్స్ చోరీకి గురయ్యాయి. స్థానికులు తెలిపిన విరాల మేరకు అడుసుమల్లి భూషయ్యకు చెందిన పొలంలో రెండు సోలార్ వ్యవసాయ మోటార్‌లకు సంబంధించి ప్యానల్స్ ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు మూడు చక్రాల ఆటోలో పొలం లోకి వచ్చి రెండు మోటార్‌లకు సంబంధించిన ప్యానెల్స్ దొంగలించుకొని తీసుకుపోయారు. అప్పటికే వర్షపు జల్లులు పడి ఉండడంతో ఆటో వెళ్లిన జాడ స్పష్టంగా కనిపిస్తోంది. ఆటో నామ్ రోడ్డుకు వెళ్లినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. చోరీకి గురైన సోలార్ ప్యానల్స్ ఖరీదు బహిరంగ మార్కెట్‌లో సుమారు మూడు, నాలుగు లక్షల రూపాయల వరకు ఉంటుందని అంచనా. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై రైతులకు బిగించిన సోలార్ ప్యానల్స్‌ను దొంగలు దొంగలించుకు పోయి ఒక్కొక్కటి రూ.60 నుంచి రూ.70 వేలకు అమ్ముకుంటున్నారు. తరచూ చోరీలు జరగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయిప్రసాద్

అంబడిపూడిలో వైద్య శిబిరం

బల్లికురవ, జూలై 29 : పక్షం రోజుల నుంచి విష జ్వరాలు, చికున్ గున్యాతో బాధపడుతున్న అంబడిపూడి గ్రామంలో డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన జనరల్ ఫిజీషియన్ వైద్యాధికారి సాయిప్రసాద్ పర్యవేక్షణలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ జ్వరాలతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా మందులను వాడాలన్నారు. అలానే కాచి చల్లార్చిన నీటిని సేవించాలన్నారు. నొప్పులు కూడా తగ్గుతాయని ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. ఇంటి పరిసరాలలో దోమ తిరగకుండా మురుగు నిల్వలు లేకుండా చేసుకోవాలన్నారు. గ్రామంలో జ్వరాలు అదుపులోకి వచ్చే వరకూ ప్రతి రోజు వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. ఈసందర్భంగా పలువురికి రక్త నమునాల పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు కొందరు వైద్య శిబిరంతో పాటు శానిటేషన్ పనులు కూ డా ప్రతి రోజు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ శిబిరంలో వైద్యాధికారులు రమీజ్, రవితేజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తుల దాడి

ఒకరికి తీవ్రంగా, ఇద్దరికి స్వల్పంగా గాయాలు

చీరాలటౌన్, జూలై 29 : గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనలో పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం రాత్రి వేటపాలెం వద్ద జాతీయ రహదారిలోని పెట్రోల్ బంకు వద్ద చోటుచేసుకుంది. అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెంకు చెందిన గుమ్మడి చైతన్య ఓ రిసార్ట్స్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈక్రమంలో రాత్రి సమయంలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై మిత్రుడు పసుపులేటి నాగార్జునతో కలిసి పెట్రోల్ బంకులో ఆయిల్ కొట్టించుకుని నగదును ఫోన్ పే చేస్తుండగా గుర్తుతెలియని సుమారు 10 మంది అకస్మాత్తుగా వచ్చారు. వీరి పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఈక్రమంలోనే ఇద్దరిని, పక్కనే ఉన్న జర్నలిస్ట్ అశోక్‌ను దాడి చేసి గాయపరిచారు. దీంతో చైతన్యకు తీవ్రంగా, మిగిలిన వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. దీంతో బాధితులు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని పెట్రోల్ బంకులో సీసీ కెమెరా పుటేజీ ఆధారాలను సేకరిస్తున్నారు.

పాఠశాలల్లో సామూహిక భోజనాలు

అద్దంకిటౌన్, జూలై 29 : అద్దంకి పట్టణంలోని సత్రం బడిలో సోమవారం శిక్షా సప్తాహ్ 2020 కార్యక్రమంలో భాగంగా సామూహిక శుభ దిన్ భోజన్ కార్యక్రమాన్ని అధికారులు విద్యార్థులతో కలిసి నిర్వహించారు. హెచ్‌ఎం ఇట్టా రామారావు అధ్యక్షతన జరిగిన సామూహిక భోజన కార్యక్రమంలో ఎంఈవో బి. సుధాకరరావు, 12వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్‌బాబు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కాశీలక్ష్మి, పూర్వ విద్యార్థులు చామర్తి మల్లికార్జునరావు, మస్తాన్, తల్లిదండ్రు భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేదవతి, కొండమ్మ, జగన్నాథం బాబురావు, ధనలక్ష్మి, జయకుమారి, స్వర్లత, సిఆర్‌పిలు పుణ్యవతి, రమేష్, రామకృష్ణ, శంకరరావు, గురవయ్య, ఐఈఆర్‌టీలు శ్రీనివాస్, యోనా పాల్గొన్నారు. బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో జరిగిన సామూహిక భోజన కార్యక్రమంలో ఎంఈవో 1 డి. గంగాధరరావు విద్యార్థులతో కలిసి సామూహిక భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నూజెళ్లపల్లి పాఠశాలలో ప్రత్యేక తినుబండారాలతో భోజనం చేస్తున్న విద్యార్థులు

పంగులూరు, జూలై 29 : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సోమవారం తిధి ప్రత్యేక భోజన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. బాల బాలికలకు దాతలు సమకూర్చిన ప్రత్యేక పదార్థాలను మధ్యాహ్న భోజనంలో ఒడ్డించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు తల్లీబిడ్డలతో మొక్కలు నాటించారు. మధ్యాహ్న భోజనంలో ప్రత్యేక పదార్థాలను అందించిన దాతలను అభినందించారు. నూజెళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పచ్చిపులుసు నాగేశ్వరరావు బాల బాలికలకు స్వీట్స్ సమకూర్చారు. పలు పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక భోజన కార్యక్రమంలో అధికారులు, దాతలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తపేట(చీరాల : సహపంక్తి భోజనాలతో పాఠశాల విద్యార్థులపాటు, ప్రజల మధ్య సత్సంబంధాలు పెంపొందుతాయని సమగ్ర శిక్ష జిల్లా సీఎంవో శ్రీనివాస రెడ్డి అన్నారు. జడ్పీ హైస్కూల్లో వారంరోజులుగా జరుగుతున్న శిక్షా సప్తా కార్యక్రమం ముగింపు సందర్భంగా సోమవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహపంక్తి భోజనాలు అన్ని వర్గాల పిల్లల్లో సమానత్వ భావన కలగటానికి దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. న్యూట్రిషీన్లతో కూడిన భోజనం అం దించటం ద్వారా పిల్లల్లో వ్యాధినిరోధరక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వేటపాలెం ఎంఈవో పురుషోత్తమరావు, హెచ్‌ఎం గుమ్మా శ్రీనివాసరావు, సీఆర్పీ బత్తుల సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేస్తున్న సీఎంవో శ్రీనివాసరెడ్డి



రాత పుస్తకాలను అందజేస్తున్న జ్యోత్స్న

దివ్యాంగ విద్యార్థుల సంఖ్య పెంచాలి

చినగంజాం, జూలై 29 : భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా ఐఈ కోఆర్డినేటర్ ఎం.జోత్స్న ఐఆర్డీలను ఆదేశించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిత కేంద్ర నిర్వహణ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఐఈ కోఆర్డినేటర్ అన్నారు. కేంద్ర నిర్వహణ రికార్డులను ఆమె పరిశీలించి, ఐఆర్డీలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం భవిత కేంద్రంలోని విద్యార్థులకు దాతలు భారత్ నిర్మాణ్ వలంటీర్ గోవింద స్వామి, టి.ముసలయ్య అందజేసిన రాత పుస్తకాలు, పెన్సిళ్లు, స్వీట్స్‌లను ఆమె పంపిణీ చేశారు. ఐఈ కోఆర్డినేటర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేవీ నాగజ్యోతి, అసిస్టెంట్ జీసీడీవో చారులతలు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రసూల్ ఇన్సాబేగం, ఐఆర్డీలు తాళ్లూరి బాలకృష్ణ, డి.నాగార్జున, ఆయా రాజేశ్వరి, సీహెచ్ కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాడి రైతులకు ఉచిత పశుగ్రాస విత్తనాలు

బల్లికురవ, జూలై 29 : పాడి రైతులకు పశు సంవర్ధక శాఖ ద్వారా ఒక్కో రైతుకు 3 కేజీల గడ్డి జొన్న విత్తనాలను అందిస్తుందని పశువైద్యాధికారులు మహేశ్వరరావు, పావని తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ బల్లికురవ, అంబడిపూడి, ఉప్పుమాగులూరు గ్రామాల పశువైద్యశాలల పరిధిలో ఉన్న గ్రామాల పాడి రైతులకు ఉచితంగా గడ్డి విత్తనాలను అందిస్తామని రైతులు ఆధార్ కార్డు, ఫోను నెంబర్, పాల కేంద్రానికి పాలు పోసే కార్డును తీసుకొని వైద్యశాలలను సంప్రదించాలని వారు కోరారు.

విద్యార్థినులకు ప్రతిభ ప్రోత్సాహకాలు



విద్యార్థికి నగదు అందజేస్తున్న కోటా

పర్చూరు, జూలై 29: ప్రతిభ కలిగిన విద్యార్థినులను గుర్తించి వారి అభ్యున్నతికి తోడ్పాటు నందించడం అభినందనీయమని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణంశెట్టి పార్వతి అన్నారు. సోమవారం బాలికల పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు బాలికలకు గ్రామానికి చెందిన రొటేరియన్ కోటా శ్రీనివాసరావు ఒకొక్కరికీ రూ.5000 చొప్పున నగదును అందజేశారు. తన కుమార్తె ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణత సాధించడం నిరుపేద విద్యార్థులకు తమ వంతు సహకారం అందించాలన్న సంకల్పంతో ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, పాబోలు ఉదయ్‌భాస్కర్, నాగబైరు శ్రీనివాసరావు, కోమట్ల ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, క్రిష్ణంశెట్టి రమేష్ బాబు, శ్రీనివాసరావు, హెచ్‌ఎం అవని, సిబ్బంది పాల్గొన్నారు.

ఎత్తిపోతలను పరిశీలించిన ఎస్ఐ

బల్లికురవ, జూలై 29 : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఎత్తిపోతల పథకంలో మోటార్లు చోరీ జరిగిన ప్రదేశాన్ని సోమవారం బల్లికురవ ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఎత్తిపోతల పథకంలో ఎన్ని మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లారని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ సీజన్ కావడం వలన కొందరు దొంగలు రాత్రుళ్లు పొలాల్లో ఉన్న మోటార్లను చోరీలు చేస్తున్నారన్నారు. తాము కూడా రాత్రుళ్లు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి బీట్ డ్యూటీలు చేయిస్తామన్నారు. ఎక్కడైనా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే తమకు సమాచారం అందించాలని అయన రైతులకు సూచించారు. ఈ పరిశీలనలో పలువురు రైతులు పాల్గొన్నారు.



చోరీకి గురైన పరికరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

పర్చూరు, జూలై 29 : రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ ఆధ్వర్యంలో పర్చూరులోని ఎఎన్‌వీఎస్ బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు సోమవారం నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యకు ప్రాధాన్యత కల్పించాలన్న సంకల్పంతో రోటరీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు పాబోలు ఉదయ భాస్కర్, నాగబైరు శ్రీనివాసరావు, కోమట్ల ఆంజనేయులు, కోటా శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి ఆపాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన

పంగులూరు, జూలై 29 : కుష్ఠు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదని, వారి పట్ల ప్రేమాభిమానాలు చూపాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య అన్నారు. మండలంలోని కోటపాడు గ్రామంలో సోమవారం కుష్ఠుపై ప్రజలకు అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని రాగి మచ్చలు, చేతులు, పాదాలలో నొప్పి లేకుండా పుండ్లు ఏర్పడినా, కాళ్ల చేతులలో కండరాల బల హీనత లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు హరిబాబు, మదర్సా, సీహెచ్‌వో బిందు, ఏఎన్‌ఎం మంగమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

నకారాకు నివాళి

మార్టూరు, జూలై 29 : ప్రభుత్వ ఉద్యోగులు పెన్షను పొందడానికి డీఎస్ నకారా చేసిన సేవలను పెన్షనర్లు జీవితకాలం గుర్తుంచుకుంటారని విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు ఆయనను స్మరించుకున్నారు. సోమవారం పెన్షనర్ల పితామహులు డీఎస్ నకారా వర్ధంతి సందర్భంగా మార్టూరులో విశ్రాంత ఉద్యోగులు భవనం వద్ద ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రావుల బాపయ్య, శివ రామకోటేశ్వరరావు, హరిప్రసాద్, హనుమంతరావు, కే హనుమంతరావు, పుట్టా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నకారా విగ్రహానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు